శ్రీ వైఖానస పత్రిక

మాస పత్రిక

'భక్త్యా భగవంతం నారాయణ మర్చయేత్"

శ్రీ వైఖానస దివ్య సిద్ధాన్త వివర్ధనీ సభ, తిరుమల వారిచే
ప్రచురింపబడుచున్నది

సంపుటి : 1 ఫిబ్రవరి 1998 సంచిక - 8

శ్రీ వల్లభరాయస్వామి వారు

స్వర్ణ - ప్రకాశం జిల్లా

శ్రీ వైఖానస పత్రిక

ఓం నమో నారాయణాయ
ఓం నమో భగవతే వాసుదేవాయ
శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే

ఈ మంత్ర రత్నములను అందఱూ స్మరించుచుండవలయును

వ్యవస్థాపకులు : కీ॥శే॥ **"బాలకలానిధి" దీవి శేషాచార్యులు**

సంపాదకులు :
దీవి విభవనసాచార్యులు

ఉప సంపాదకులు :
వేదాంతం రామకృష్ణమాచార్యులు
అగ్నిహోత్రం రంగాచార్యులు

సంపాదకవర్గ సభ్యులు :
A. శ్రీనివాసాచార్యులు
దీవి వెంకట్రామాచార్యులు
వాదవల్లి జానకి రామానుజాచార్యులు
P. వెంకట రమణాచార్యులు

చందా వివరములు

మహారాజ పోషకులు	రూ.5000/-
రాజపోషకులు	రూ.2500/-
పోషకులు	రూ. 1116/-
సంవత్సర చందా	రూ. 70/-
విడి పత్రిక	రూ. 6/-

ఈ పత్రికలోని రచయితల అభిప్రాయములు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గాని, సంపాదవర్గము గాని, శ్రీ వైఖానస దివ్య సిద్ధాన్త వివర్ధినీ సభ వారు గాని వాటికి బాధ్యత వహించజాలరు.

విషయసూచిక

		పేజి
1.	సంపాదకీయం	1
2.	ఓం నమో విష్ణవే	3
3.	ఆగమశాస్త్ర అనువాద ఆవశ్యకత	5
4.	శ్రావణ పూర్ణిమ	6
5.	శ్రీ వల్లభరాయస్వామి దేవస్థానము	7
6.	అసమాన వారసత్వం	8
7.	సంఘ పరిపుష్టికి సూచనలు	9
8.	ఒక చిన్న కథ	13
9.	అత్రి మహర్షి పవిత్ర చరిత్ర	15
10.	శ్రీ వైఖానస ధర్మచంద్రిక	16
11.	ద్వైతా ద్వైత విశిష్టాద్వైత లక్ష్మీ విశిష్టాద్వైతములు	24
12.	భాగవత పద్యగాథావళి	29

ఉత్తర, ప్రత్యుత్తరములు, వ్యాసములు, చందాలు, వగైరా పంపవలసిన చిరునామాలు :

శ్రీ వైఖానస పత్రిక
S.V.D.S.V. సభ కార్యాలయం
రింగురోడ్డు - **తిరుమల**
చిత్తూరు జిల్లా - 517 504
ఫోన్ : 77282

శ్రీ వైఖానస పత్రిక
వైద్య సేవాసదన్,
రాజ్ యువరాజ్ ఎదురుగా
గాంధీనగర్, **విజయవాడ** - 520 003
ఫోన్ : 574243

"భక్త్యా భగవంతం నారాయణమర్చయేత్"

సంపుటి 1 ఫిబ్రవరి '98 సంచిక 8

సంపాదకీయం

మనము తెలుసుకోవలసినవీ, ఆచరించవలసినవీ ఎన్నో విషయాలు వుంటాయి. జీవితంలో భార్యా బిడ్డలు, కుటుంబము, సంసారము, బంధు మిత్రులు, ఉద్యోగ వ్యాపారములు, వివిధ వృత్తులు, తిండి, గుడ్డ, గృహము, గౌరవము, సిరిసంపదలు, యివన్నీ అవసరమే. అవి ఒకదానికొకటి పెనవేసుకుని వుంటాయి. మనకున్న విద్యా సంస్థలు, విద్య, వివిధ పత్రికలు, టి.వీ. కార్యక్రమాలు విజ్ఞానముపై వాటిని గురించి మనకు బోధిస్తుంటాయి. అయితే మానవ జీవితానికి యివేనా పరమావధులు లేకయింకేమైనా వున్నవా అనే ఆలోచన ఒకప్పుడు కాకపోతే ఒకప్పుడైనా ప్రతివారికి కలుగుతుంది. అట్టి ఆలోచన చేసి ఈశ్వరుడు, ప్రకృతి, జీవుడు అనే వాటిని గుర్తించి వాటికి గల సంబంధాలను మన పూర్వులు తత్వవేత్తలు చక్కగా వివరించారు. వారు విభిన్న మార్గాలను సూచించారు. అవి విభిన్న మతాలుగా తయారయినాయి. అందరూ భగవంతుడు ఒక్కడే అనే అభిప్రాయాన్ని అంగీకరించారు. ఆయనను చేరే మార్గాలు వేరుగావచ్చు. అన్నిటి ధ్యేయమూ ఒక్కటే. అదే మోక్షము.

మోక్ష మార్గాన్ని చూపేది, సనాతనమైనది, మన హిందూ మతము. అందులో ఎన్నో శాఖలున్నాయి. ఏ పద్ధతినవలంబించినా పట్టుదల, భక్తి, శ్రద్ధలుంటే గమ్యాన్ని చేరగలము. అందులోని ఒక శాఖయే శ్రీ వైఖానస భగవచ్ఛాస్త్రము. అందులో కూడా ఎన్నో కొమ్మలు, రెమ్మలు, ఆకులు, పూలు, పండ్లు వున్నాయి. ఈ వైఖానస శాస్త్రానికి శ్రీ విఖనసులవారు మూల పురుషులు. వారి ప్రథమ శిష్యులైన భృగు, మరీచి, అత్రి కశ్యపులు వివరముగా గ్రంథములు రచించారు. ఈ గ్రంథాలలో వున్న కొన్ని ముఖ్యాంశాలు యివి :

1) అష్టాదశ శారీరక కర్మలు.
2) వర్ణాశ్రమ ధర్మములు.
3) ప్రవరలు.
4) శ్రౌత విధానము.
5) దేవాలయ నిర్మాణము.
6) విగ్రహ నిర్మాణము.
7) కర్షణాది ప్రతిష్ఠాంతము.
8) ప్రాయశ్చిత్తములు.

9) నిత్యార్చన, విశేషార్చన, ఉత్సవములువగైరా భగవదారాధన కార్యక్రమములు.

10) తత్వజ్ఞానము.

యీ కర్మకాండలు, జ్ఞాన మార్గము అన్నీ చెప్పి చివరలో శ్రీ ఆచార్యులవారు మనకు చెప్పిన ముఖ్యాంశము ఏమంటే.

"సగుణే బ్రహ్మణి బుద్ధిం నివేశ్య పశ్చాన్నిర్గుణం బ్రహ్మ౨౨ శ్రిత్య మోక్షే నిత్యం యత్నం కుర్యాదితి విజ్ఞాయతే"

-అష్టమప్రశ్న - 11 ఖండ - 113 సూత్రము.

అనగా సగుణ బ్రహ్మయందు బుద్ధిని ప్రవేశపెట్టి క్రమముగా ఆ తర్వాత నిర్గుణ బ్రహ్మానాశ్రయించి నిత్యమూ మోక్షప్రాప్తికి ప్రయత్నము చేయవలెనని తాత్పర్యము. శ్రీ శాస్త్రము ఆ మార్గమునే విశదపరచినది.

ఆ ప్రయత్నములో సహకరించుటకుగాను శ్రీ వైఖానస దివ్య సిద్ధాన్త వివర్ధినీ సభవారు ఈ పత్రికను నడుపుచున్నారనే మాట నిర్వివాదాంశము. ఈ ఆశయముతోనే పత్రిక ప్రారంభింపబడినది. అందులో భాగముగా శ్రీ శాస్త్రములో చెప్పబడిన వివిధ అంశములు కూడా తీసుకుని వాటికి సంబంధించిన వ్యాసములు ప్రచురించవలెనని సంకల్పము.

ఒక్క అర్చక వృత్తిలో యున్నవారికేగాక, యితర వృత్తులలో యున్నవారికి కూడా ఈ శాస్త్ర విషయములు వివరించి వారిని కూడా మోక్ష మార్గము వైపు తీసుకు పోవలయునని ఈ సభవారి అభిప్రాయమని మనవి చేయుచున్నాను. జీవనోపాధికి, జీవిత గమనమునకు కావలసిన లౌకిక విషయములను బోధించు విద్యాసంస్థలు, పత్రికలు, గ్రంథములు ఎన్నియోగలవు. అవి విరివిగా లభ్యమగుచున్నవి. గాన వాటిని గురించి పత్రిక ద్వారా వివరించుట అనవసరమని భావించబడుచున్నది. శ్రీ శాస్త్ర విషయములను వివరించు పత్రికలు లేవుకదా !

సభవారి ఈ ఆశయమును గుర్తించి, సహకరించి శాస్త్ర విషయములు, ఆధ్యాత్మిక విషయములు, భక్తి ప్రపత్తి మార్గములు మొదలగు అంశములపై లలితమై, సుబోధకముగా నుండునట్లు వ్యాసములు పంపవలసినదిగా పండితులను, రచయితలను ప్రార్థించుచున్నాము. ఈ విషయములను బాలురకు, యువకులకు, స్త్రీలకు, పామరులకు కూడ అందివ్వవలసి యున్నది. అందరూ తెలుసుకొనవలసి యున్నది. వేద వేదాంగములలోని విషయములు, పురాణేతిహాసములలోని విషయములు, ఉపనిషత్తులు, భగవద్గీత వగైరాలలోని అంశములు కూడా సేకరించి మోక్షమార్గము ననుసరించుట కష్టమైన పనికాదనియూ, అందరికీ అది వీలగుననియూ చెప్పవలసి యున్నది. భగవంతునిపై విశ్వాసము, భక్తి శ్రద్ధ కలిగిననాడు తాను తరించుటయేగాక శాంతి, సౌభాగ్యములను కూడా ప్రోత్సహించగలరు. అట్టి ఉన్నతాశయములతో పత్రికను నడపించుటకు అందరూ సహకరించి, ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము. సభవారి యొక్క ఈ ఆశయములోగాని, ఆచరణలోగాని, ఏవైనా దోషములు కన్పించినచో వాటిని తెలియపరచి, ఆశయసిద్ధికి తగు సలహాలు, సూచనలు పంపవలసినదిగా ప్రార్థించుచున్నాము.

D. వికనసాచార్యులు,
సంపాదకుడు.

ఓం నమో విష్ణవే

'సాహిత్య విద్యా ప్రవీణ'
డా॥ వేదాంతం సత్య శ్రీనివాస అయ్యంగార్,
నర్సరావుపేట.

(గత సంచిక తరువాయి)

గౌణనామ ఫల విచారణ - భిన్న భిన్న పుష్పముల యందలి తేనెను గ్రోలిన తుమ్మెద ఆతేనెను తేనె తుట్టెలో చేర్చిన విధముగ ఈ నామములన్నియు భగవత్పరములై భగవత్ప్రాప్తిని కలిగించును. ఇంకనూ తేనెతుట్టెలో చేరిన పిదప ఆయా పుష్పముల తేనెకు తమ తమ ప్రత్యేకతలేని విధముగనే ఈ వేయినామములు దివ్య సహస్రనామస్తోత్ర మహామంత్రమై భగవత్ప్రాప్తిని జీవునకు అందించుచున్నవి. విభిన్న పుష్పముల యందలి తేనె బిందువుల యందు మాధుర్య గుణము సాధారణమైనప్పటికి పాత్ర పుష్ప విశేషము ననుసరించి స్వారుత్వము నందు బేధముండును. కాని ఆ మకరంద బిందు సమూహమును మధుకోశము నుండి గ్రహించినప్పుడు కల్గెడి మాధుర్యాధిక్య మనంతము. అనిర్వచనీయము కూడ. అటులనే ఈ స్తోత్రమందలి ఒక్కొక్క నామము భగవత్ప్రాప్తిహేతువైనప్పటికి వీటి సమూహము భగవత్సాన్నిధ్యము కలిగించుటలో ఆశ్చర్యమేమున్నది. ఇంకనూ యోచించగ వేరు వేరు పుష్పముల యందు తేనెను గ్రోలునప్పుడు అనుభూతులు వేరు వేరుగ యున్నప్పటికి, మధుకోశము చేరిన పిదప ఆ తేనె బిందువుల సమూహానుభూతి ఒక్కొటిగనే యుండును. కాని ఏ బిందువునకు, ఆ బిందువు తన ప్రత్యేక పుష్ప సంస్కార విశిష్టమైన అనుభూతిని పొందింపజేయలేదు. అటులనే మధుకోశమందలి తేనెను సాక్షాత్గ్రోలువానికిని, పువ్వు పువ్వు నందలి తేనెను తేనె తుట్టెలో జేర్చి ఆ తేనెను గ్రోలువానికి రసానుభూతి యందు వ్యత్యాసము లేకున్నప్పటికి ఆ అనుభూతిని పొందుటకై చేసిన ప్రయత్నములో ఎంతయో అంతరమున్నది. ఈ విధముగనే సద్వారకములైన అధ్యాపకనామములతో గాని, అద్వారకములైన వ్యాపక నామముతోగాని భగవత్ప్రాప్తి పిదప అనుభూతి ఒక్కటియేకాని, ఫలక్రమమును సాలోక్య - సామీప్య- సారూప్య-సాయుజ్యములని నాలుగు విధములుగ ఆగమ శాస్త్రములు చెప్పుచున్నవి. ఇందు సాయుజ్య స్థితియే సంసార బంధవాసనలు తొలగిన మోక్షము.

స్తోత్ర ప్రయోజనము

"నవాసుదేవ భక్తానామశుభం విద్యతే క్వచిత్ ॥" వి.స.

ఎవరు ఈ స్తోత్రమును చదివెదరో, చదివించెదరో, ఉపదేశించెదరో, ఉపదేశమునొందెదరో, వినెదరో - గానము చేసెదరో వారికి ఈ లోకమున ఎట్టి అశుభములు కలుగవు. స్వర్గాది లోకములను పొందిన పిదప నహుషునివలె పతనము నొందరు. జ్ఞానమును - విజయమును, స్థిరమైన ఐశ్వర్యమును, సుఖమును, సంతానమును, ధర్మార్థకామ మోక్షములనెడు చతుర్విధ పురుషార్థములను, కీర్తిని, ఉన్నతస్థానమును పొందుదురు.

ఆరోగ్యముతో బలముతో ప్రకాశించెదరు. రోగము నొందినవాడు రోగముక్తుడగును. కారాగారమున బంధింపబడిన వాడు చెరసాల నుండి విడిపింపబడును. భయము నొందినవాడు భయమునుండి విముక్తుడగును. సర్వపాపవినిర్ముక్తుడై జీవుడు సనాతన పరబ్రహ్మమైన విష్ణుసాన్నిధ్యమును చేరును. జనన - మరణ - వార్ధక్య - వ్యాధులు తొలగిపోవును. ఈస్తోత్రం శ్రద్ధాసక్తులతో చదివితే సుఖశాంతులు - సహనం - సంపద చక్కని స్మరణ శక్తి, కీర్తి లభించగలవు. విష్ణు భక్తులకు క్రోధం లోభం. అసూయ - దుర్బుద్ధులు కలుగవు. కనుక విష్ణు సహస్రనామ స్తోత్రమును జాతి, లింగ వివక్షత లేక అందరును శ్రద్ధతో మహావిశ్వాసంతో పఠించి సకలాభీష్టములు సాధించుకోవచ్చును.

బుధ గ్రహమునకు అధిదైవము విష్ణువు కనుక బుధమహర్దశ. అంతర్దశలయందు ఈస్తోత్ర పారాయణం వలన బుధగహ ప్రీతికలిగి, తద్ద్వారా బుధ గ్రహ దోషములు తొలగి సుఖశాంతులు కలుగునని జ్యోతిష శాస్త్రము తెలియు జేయుచున్నది. అటులనే సర్వగ్రహశాంతికి'విష్ణు' సహస్ర నామస్తోత్రము ఒక దివ్య మహామంత్రము.

వైద్య శాస్త్రమున చరకుడు చికిత్సాస్థానమున జ్వర విముక్తికై చికిత్సా విధానమును తెలిపి, పిదప సహస్రమూర్ధుడు చరాచరపతియు సర్వవిభుడైన విష్ణువుని నామ సహస్రములో స్తుతించిన సర్వజ్వర బాధల నుండి విముక్తుడగుననెను. ఇటులనే మేహశాంతికి, రాచకురుపు నివారణకు కూడా విష్ణు సహస్రనామ స్తోత్రపారాయణ - జప - హోమ - అర్చన - ధ్యానములను శాస్త్రములు నుడువు చున్నవి. విష్ణు సహస్రనామ స్తోత్రమహా మంత్రహోమ భస్మము విషమునుకూడవిరిచివేయునని మంత్ర మహార్ణవ గ్రంథరాజము తెలుపుచున్నది.

లౌకిక కావ్యకర్తయైన బాణభట్టుడును 'నిరంతరం జపింపబడుచున్న నారాయణ సహస్రకము' కలదిగ సూతికాగృహమును వర్ణించెను. ఈవిధముగ విష్ణుసహస్రనామస్తోత్రము గ్రహణ - ధారణ - శ్రవణ - జప - సంకీర్తన -లేఖన -వ్యాఖ్యాన - తన్నిష్ఠ పూజనాదులచే విష-పిశాచ - వ్యాధి, గ్రహ, దుస్స్వప్న, దుర్నిమిత్తాది బహు విధ దోషములను ఉపశమింపజేయును. మహాపాతకాది ప్రాయశ్చిత్తములకు, ఇహ - పర అభ్యుదయములకు, భవ పాశవిచ్ఛేదనమునకు, పరమపద విష్ణు సాన్నిధ్యమును పొందుటకు, భగవద్గుణ సంకీర్తన సుధాస్వాదసుఖమునకు, బాల-మూర్ఖ - మూక, స్త్రీ, నాస్తిక, సర్వవిధ, సర్వజాతి, వయోలింగ సామాన్యముగ ఈ విష్ణు సహస్రనామ స్తోత్రమును శ్రద్ధతో - భక్తితో - మహావిశ్వాసంతో సర్వప్రాణులు స్వీకరించి తరించుదురనుటలో సందేహము లేశమాత్రమును లేదు. సర్వనియమాది క్లేశములు లేక, సర్వజన సామాన్య సేవ్యమానమై, వేదాధ్యయనము కంటెను సుఖకరముగ, నిరపాయముగ, అభ్యుదయమే పరమావధిగయున్న ఈ విష్ణు సహస్రనామస్తోత్ర పఠనము, సర్వమానవాళికి క్షేమంకరమై - ఈ స్తోత్రనాదము విశ్వశాంతి సంధాయకమై, జగత్కల్యాణ కారకమగును గాక ! !

ఓం శాంతిః శాంతిః శాంతిః

ఆగమశాస్త్ర అనువాద ఆవశ్యకత

శ్రీ పరాంకుశం పట్టాభిరామచక్రవర్తి

ఆగమశాస్త్రమును అనుసరించి కార్యక్రమం జరిగినది అని అంటూ ఉంటే వింటూ ఉంటాం. అయితే ఆగమశాస్త్రం అంటే ఏమిటి ? ఆగమము అంటే ఏమిటి ? ఆ శాస్త్రంలో నిక్షిప్తమై ఉన్న సమాచారం ఏమిటి ? అనే విషయాన్ని తెలుసుకొనుటకు నేటి యువత ఏ విధమయిన ఆలోచనా చేయుట లేదనుటలో అతిశయోక్తిలేదు. అయితే అటువంటి జిజ్ఞాస కలిగిన యువకులకు వారి జిజ్ఞాసను తీర్చుకొనుటకు అవసరమయిన గ్రంథములు ఏవియూ లేవనే చెప్పవచ్చు. దానికి కారణం ఇంత వరకూ మన సంస్కృత ఆగమ గ్రంథములలోని శాస్త్రీయమైన విజ్ఞానమును తేటతెనుగులోనికి అనువదింపక పోవుటయే అని నా అభిప్రాయం. కాబట్టి అంతరించిపోవుచున్న మన ఆగమ శాస్త్రములోని శాస్త్రీయ విజ్ఞానం (Scientific knowledge) మరల పునరుజ్జీవింప చేయవలయునంటే, దానికి ఒక్కటే ఉపాయం కలదు. అది కేవలము అనువాదం వలననే సాధ్యమవుతుంది. దాని వలన వాటిపై జిజ్ఞాస పెరుగుతుంది.

నేడు భారతీయ ఆధ్యాత్మిక విజ్ఞానం విదేశీయులను ఎంతగానో ఆకర్షించు చున్నదనుటలో ఆశ్చర్యము లేదు. దానికి కారణం మన శాస్త్రములలోనిది స్వచ్ఛమయిన విజ్ఞానం, మరియు మన దైనందిన జీవితంలో సులభముగా ఆచరింపదగినది. అందువలననే మన సాంప్రదాయంలోని ఎన్నో ఆచారములు మన దేశములో నేటికీ నిలచియున్నవి. అంతేకాకుండా ఈ ఆచారములలో ఎన్నో ఆరోగ్య సూత్రములు దాగి యుండుట విశేషము. ఈ విషయము నేటి యువతరానికి చెందిన వారికి తెలియకపోవుట వలననే అనారోగ్య భరితమయిన దురాచారములు, అసౌకర్యపూరితమయిన వస్త్రధారణ చేయుచూ పలు ఇబ్బందులకు గురి అగుచున్నారు. అట్లుకాకుండా శాస్త్రీయమయిన కట్టు, బొట్టు ధరించినచో మానవునికి ఏ విధమయిన ఉపయోగం ఉంటుందో శాస్త్రీమయమని గ్రంథాలలో పేర్కొనవలసిన అవసరం ఉంది. మన భారతీయ సాంప్రదాయమయిన శిఖ, ఊర్ధ్వ పుండ్రములు ధరించి నిరంతరమూ శ్రీ కృష్ణనామ సంకీర్తనలో మునిగి తేలుచున్న పాశ్చాత్యులు ఎందరో యున్నారు. మన భారతీయ ఆధ్యాత్మిక గ్రంథాలను నేటి యువతలోని శాస్త్రీయమయిన దృక్పథానికి సరిపడిన రీతిలో అనువదించుట తక్షణ కర్తవ్యమని భావించాలి. మన తెలుగు వైఖానస భావి యువతీయువకులకు వారి జీవనశైలిని మన ఆగమశాస్త్ర పరిధులను దాటి పాశ్చాత్య వ్యామోహములో పడనీయకుండుటకు మన ఆగమ గ్రంథాలను, మన వైఖానసశాఖలోని ఆగమాచార్యులు, పండితులు, ఈనాఆవేదనను అభ్యర్థనగా స్వీకరించి చక్కని గ్రంథ పరిష్కర్తల సహాయముతో తెలుగులోనికి అనువదింపమని కోరుకుంటున్నాను.

నా ఆవేదనకు కారణం, నేటి మన వైఖానస యువకులలో కొంతమంది కనీసము మన దేవతా స్వరూపాలను కూడ గుర్తించలేని స్థితిలో యున్నారు. దీనికి కారణం సంస్కృత భాషాపూరితమయిన గ్రంథాలను పఠించలేని స్థితియే. అంతేకాకుండా సంధ్యావందనము మొదలయినవి చేయుట వలన కలిగే ఉపయోగాలు ఏమియున్నవో తెలియక పోవుట చేత వాటిని ఆచరించుట లేదు. ఇంకొక విషయమేమనగా మన దేవాలయాల్లో పని చేసే యువ అర్చకులకు ధర్మసూక్ష్మ సహితమయిన విజ్ఞానం అందుబాటులో లేకపోవుట చేత దేవాలయానికి వచ్చే భక్తుల సందేహాలను తీర్చుటలో విఫలమవుతూ వారిచే పరిహసింపబడుట నా మనస్సును కలచివేసినది. కాబట్టి దయచేసి మన వైఖానస సంఘము వారు కనీసము మంత్రపుష్పము, వివాహము, శాంతికల్యాణము, సంధ్యావందనము, నిత్యార్చనా విధి, విమానార్చన కల్పము (దేవాలయ నిర్మాణంలోని శాస్త్రీయమయిన దృక్పథం), సూక్తములు మొదలైన వాటిని, మంచి భాషా పరిజ్ఞానము గల ఆగమవేత్తలచే, వారి దివ్య అనుగ్రహముచే అనువాద కార్యక్రమము జరిపించి, భావివైఖానస యువకులను మంచి శాస్త్ర పరిజ్ఞానం గల ప్రజ్ఞావంతులుగా తీర్చిదిద్దగలరని భావిస్తున్నాను.

శ్రావణ పూర్ణిమ

- ఖండవల్లి కేశవాచార్యులు,, భీమవరం

శ్లో॥ నారాయణాత్మజం వందే విఖనో మునిపుంగవమ్
తత్పుత్రాన్ భృగుమత్రించ మరీచిం కశ్యపం తథా ॥
నైమిశారణ్య ప్రభువునకు నమః సుమాంజలి.

శ్రావణ పూర్ణిమ వైఖానసులకు పర్వదినం, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడులలో అత్యధికముగా మరియు యావత్ భారతదేశము నందు జీవనము సాగిస్తున్న లక్షలాది వైఖానసులకు పర్వదినము.

ఏ మహానుభావునైతే వైఖానస శాఖీయులందరూ మూలపురుషునిగా భావిస్తూ ఆరాధిస్తున్నారో అట్టిమహర్షికి ఆంధ్రప్రదేశ్‌లోనే ప్రత్యేక దేవాలయంలో 1974 సం॥లో వైఖానస శిష్యుల కృషితో పశ్చిమగోదావరి జిల్లాలోని శృంగవృక్షం గ్రామంలో,భృగు, మరీచి, అత్రి కశ్యప సహిత, విఖనస మహర్షి ప్రతిష్ఠ గావింపబడి నాటి నుండి నేటి వరకూ నిత్యం త్రికాలార్చనలు జరుగుచున్నవి.

శ్రీ మహావిష్ణువు నాభి నుండి యుద్భవించిన కమలములో విఖనస మహర్షి ఆవిర్భవించారని, మన ఆగమ శాస్త్రం చెబుతోంది. సాక్షాత్ శ్రీమహావిష్ణువు మానసపుత్రుడైన శ్రీ విఖనస మహర్షి భగవదర్చన విధానాలను భరత ఖండములో ప్రబోధించి సర్వజనులకు మోక్షప్రాప్తిని ప్రసాదించేందుకు వచ్చిన కారణజన్ముడు అని ప్రతీతి.

ఆదికాలంలో యజుర్వేదశాఖగా, వైఖానస సూత్రాన్ని రచించినది విఖననుడేయని వైఖాననులు నమ్ముతారు.

వైఖాననుడు అనే పదానికి బ్రహ్మవిదుడు అనే అర్థం ఉంది. ఇతర బ్రహ్మపుత్రులవలే కాక విఖనస మహర్షికి శ్రీమహావిష్ణువుకుండే చిహ్నాలన్నీ వున్నాయి. వైఖానసుల పూజా విధానం అంతా ఋగ్వేద, యజుర్వేదముల నుండి ఎన్నుకోబడింది.

సాకార నిరాకారం అనే పద్ధతులలో వైఖానస పూజా విధానం సాగుతోంది, వైఖాననుని ప్రతి ఆలయములోను ధృవ బింబము అనబడే ప్రధాన శిలా ప్రతిమతో బాటు మరో నాలుగు ప్రతిమలు ఉంటాయి.

బ్రహ్మ విష్ణువుల నుండి వైఖానస సూత్రాలను పొందిన విఖనస మహర్షికథలో విఖనస మహాముని వేయికోట్ల శ్లోకాలలో తన శిష్యులకు బోధన జరిపినట్లు శాస్త్రాలు చెపుతున్నాయి. మహాభారతం శాంతి పర్వములో వైఖానస పూజా విధానము గురించి వ్రాయబడింది. అంతేగాక భృగుమరీచి అత్రి కశ్యపాది ఋషులు విఖనస మహర్షికి శిష్యులుగా పురాణాలలో పేర్కొన్నారు. అనంతరం శ్రీ మహా విష్ణువు, శ్రీనివాసమూర్తిగా తోతాద్రిలో అవతరింపగా విఖనసమహర్షి తోతాద్రివెళ్ళినట్లు చెప్పబడుతోంది. ఇందుకు నిదర్శనముగా ఆక్షేత్రములో నేటికి వైఖానస తీర్థ మొకటి కనిపిస్తోంది. ఈ విధంగా శ్రీమహావిష్ణువునకు అనేక సేవలు చేసిన తరువాత తనను గరుడవాహనుడైన శ్రీమహావిష్ణువు నియందు జేర్చుకోమని ప్రార్థింపగా భూలోకంలో పెక్కుచోట్ల నన్ను వంశపారంపర్యంగా అర్చించి కొన్ని మన్వంతరాలు గడచిన అనంతరం వైకుంఠం జేరగలవని విష్ణువు వరం ప్రసాదించినట్లు శాస్త్రాలలో వుంది. అనంతరం నేటి మంగళగిరిలో నృసింహస్వామిని శాంతింపజేసిన పిదప శతహ్రోదుని స్వామి అర్చకునిగా నియమించి విఖనస మహర్షివైకుంఠం జేరినట్లుగా విఖనస చరిత్రలో పేర్కొన్నారు. ఈ విధంగా విఖనసులు బ్రాహ్మణోత్తములైన వైఖానసశాఖీయుల మూలవిరాట్టుగా వాసికెక్కారు.

ఇటువంటి మహానుభావుని జయంత్యుత్సవమును వైఖానసులందరు వారి వారి ప్రాంతములలో జయప్రదముగా జరిపి భగవానునికి మన కృతజ్ఞతలు తెలుపుకుందాం !

శ్రీవల్లభరాయస్వామి దేవస్థానము, స్వర్ణ

- ఎ.వి. రఘునాధాచార్యులు - స్వర్ణ

శ్లో॥ శ్రీవల్లభం కరతలోజ్వల శంఖ చక్రం
స్వర్ణాంబరం వర గదాభయ దివ్యహస్తం
శ్రీ భూసమేత మతసీ కుసుమావభాసం
వందేన్వహం వరమనోహర దివ్య రూపం ॥

ప్రకాశం జిల్లా, చీరాల పట్టణమునకు సమీపమున గల 'స్వర్ణ' గ్రామములో వేంచేసియున్న, "శ్రీవల్లభరాయస్వామి" దేవస్థానములో తరతరాలుగా వైఖానస సాంప్రదాయములో నిత్యార్చన జరుపబడుచున్నది.

శ్రీ స్వామివారి విగ్రహస్వరూపము : ఆకర్షణీయమైన మూర్తితో భృగు, మార్కండేయ మహర్షులు, చామర గ్రాహిణులు స్వామికి ఇరు ప్రక్కల నుండగా శ్రీ మహావిష్ణువుకు మారు రూపుగా, శంఖు, చక్ర, గదాధరుడై మనోహరముగా నిలచిన శిలా మూర్తియే శ్రీవల్లభరాయస్వామి. స్వామికి అగ్రభాగమున దశావతారములు చెక్కబడుట అత్యంత అద్భుతముగా భావించవచ్చును.

ఈ ఆలయ లోపలి భాగములో శ్రీ స్వామి వారేగాక, శ్రీ రాజ్య లక్ష్మీదేవి, శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామిలతో పాటు పన్నిద్దరాళ్వారులు కూడా కలరు.

పూర్వచరిత్ర : ఈ ఆలయము ఎప్పుడు ప్రతిష్ఠితమైనది ఖచ్చితముగా తెలుపు శాసనములేవియు లేవు. కొన్ని పురాతన గ్రంథములలో శాలి వాహన శకము. క్రీ.శ.11వ శతాబ్దములో శ్రీవల్లభరాయస్వామి ప్రతిష్ఠ జరిగినట్లు, ఈ దేవాలయ పోషణకు మాన్యము లీయబడినట్లు వివరింపబడినది.

ఆలయములో రేచర్ల గోత్రజులు, యాచేంద్ర భూపాలురు శ్రీ వెంకటగిరి రాజావారి పేర అర్చనలు జరుగుచుండుట చేత ఈ మాన్యములు ఆరాజులే ఇచ్చినట్లు నిశ్చయింపబడుచున్నది. అదియే గాక ఈదేవస్థానమునకు ఎదురుగా ఏకశిలాధ్వజస్థంభము అపురూప శిల్పసంపదతో విరాజిల్లు చుండుటచేత, గ్రామంలో తరతరాల నుండి వినవచ్చుచున్న కథల వల్లను ఈ దేవాలయముతో వెంకటగిరి రాజులకు ఎక్కువ సంబంధములున్నట్లు తెలియుచున్నది.

క్రీ.శ. 1920వ సంవత్సరములో ఆలయపునరుద్ధరణ జరిగినది. అప్పుడు దేవాలయమునకు పెద్దగాలి గోపురమును నిర్మించుట జరిగినది.

ప్రతి సంవత్సరము భోగినాడు స్వామి వారికి కళ్యాణ మహోత్సవము జరుగుతుంది. ధనుర్మాసములో వచ్చు ముక్కోటి నాడు దేవాలయమును చూచుటకు కనుల పండుగగా నుండును.

దసరానాడు జరుపబడు 'పార్వేట' ఉత్సవము, సంక్రాంతినాడు జరుపబడు తెప్పోత్సవము, ఉగాదినాడు జరుపబడు గ్రామోత్సవములు మాత్రమే ఈ స్వామికి జరుపబడు ఉత్సవములు. ఈ ఉత్సవములలో బాణాసంచా పటాటోపముల ప్రాధాన్యత కలదు. వీటి నిర్వహణ పూర్తిగా గ్రామస్థులదే.

గ్రామములో ఎక్కువ మందికి "వల్లయ్య, వల్లభరాయుడు" అని పేరు కలిగి యుండుట స్వామివారిమీద వారి నమ్మకమును తెలియచేయును. అలాగే అర్చకకుటుంబాలలో

సైతము ఎక్కువ మందికి "శ్రీవల్లభ" అనుపదము వారి నామధేయములో కలిగి యుండుట దేవుని పట్ల వారికి గల భక్తి, ప్రపత్తులను విశదీకరించును.

ఈ మండలము (కారంచేడు)లో ఎక్కువ వైఖానస కుటుంబములను కలిగినది ఈ గ్రామమే.

శ్రీవల్లభరాయదేవస్తోత్ర గ్రంథము : శ్రీ స్వామివారిపై స్తోత్ర మేదేని వ్రాయించవలెనని మన శాఖీయులకు కలిగిన కుతూహలముతో, కోరినంతనే శ్రీ స్వామివారిపై స్తోత్రములను రచించి శ్రీ శృంగేరి (విరూపాక్ష) పీఠాధీశ్వర పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ శ్రీ నృశింహానంద భారతీస్వామి వారు శాఖీయుల మన్ననలను పొందినారు.

ఈ గ్రంథములను శాఖీయులు దేవాలయములలో ఉభయము చేయించుకొనిన వారలకు, దర్శించు ప్రముఖులకు మరియు కోరిన వారలకు ఉచితముగనే ఇచ్చుచున్నారు. ఇట్టి దేవాలయములో కార్తీక మాసమున ఆకాశ దీపమును వెలిగించుట ఆచారము గా కొనసాగుచున్నది.

అసమాన వారసత్వం !

- పరాశరం రాజగోపాల్, గుంటూరు.

శ్రీలక్ష్మీ నారాయణుని అపార కరుణా కటాక్ష వీక్షణాల వల్ల వైఖానసలోకం నేడు సుప్రీంకోర్టు ద్వారా తీర్పును పొంది సేదదీరుతున్నది. పరాభవపు అంచులదాకా వెళ్ళిన మనం, తిరిగి చెదరిపోయిన మన మౌలిక లక్షణాలను ప్రోవుచేసుకొని తిరిగి అనన్య సామాన్య వారసత్వానికి ప్రతీకలుగా నిలువ వలసిన ఆవశ్యకతను వైఖానసులు గుర్తించాలని ఆకాంక్షిస్తూ

అసమాన వారసత్వ మహో ! వైఖానసా !
ఆద్యంతం, అద్భుతం ! ఆగర్భవైష్ణవా !! ॥అసమాన॥
వేదాలు ఘోషగా మేధావి నీవన్నవి !
సంఘాలు ప్రణమిల్లి సంస్కారి నీవన్నవి !!
దీక్షా దక్షతలు నీ జన్మ హక్కులురా
ఓం కారమే నీకు శ్రీరామ రక్షరా !! ॥అసమాన॥
దేవుడే నీవాడు దైవతత్వమే నీది
అత్రికశ్యపాదుల అంశమే నీది
వైఖానసం నీది సంపూర్ణ ఆగమం
ఇష్ట కామ్యాలన్నీ సమకూర్చు సాధనం !! ॥అసమాన॥
నీకు నీవే సాటి వేదాంగ ఘనాపాఠి
గాయత్రీ మాతయే కోటి యోధుల ధాటి
రచ్చగెల్చుకోవాలిక ఉద్యమించాలి రా !!
ఏకైక లక్ష్యమిదె వీర వైఖానసా ! ! ॥అసమాన॥

సంఘ పరిపుష్టికి సూచనలు

ముత్తేవి శేషాచార్యులు,M.A., B.Ed., పెదపులిపుర్రు

కొన్ని అణువుల సముదాయము ఒక పదార్థము, కొన్ని కణముల సముదాయము ఒక జీవి. అట్లే కొన్నిజీవుల (ఆత్మల) సముదాయము సంఘము. అందుకే పురుషసూక్తంలో "సహస్ర శీర్షా పురుషః" అన్నారు. సహస్ర అంటే వెయ్యి అని కాదు అనేకమనే భావం. కాన ఈ సంఘమనే ఆకారానికి కేంద్ర, రాష్ట్ర, జిల్లా, మండల(తాలూకా) గ్రామ శాఖలు అంగాలు. ప్రతి శాఖీయుడు ఒక జీవ కణం.

ఏ జీవికైనా ఆరోగ్యకరమైన కణ పరిపుష్టత, ప్రక్క కణాలతో సన్నిహితత్వం, సత్సంబంధం, విధి నిర్వహణ, క్రమశిక్షణాయుత సంచలనము ఎంత అవసరమో సంఘమునకు ప్రతి సంఘీయుని పరిపుష్టత, ఆరోగ్యం, ప్రక్కవారితో సౌభ్రాతృత్వ దృక్పథం, బాధ్యతాయుత విధి నిర్వహణ, క్రమశిక్షణాయుత ప్రవర్తన, సంఘసేవా దక్పథం (చీమలు, తేనెటీగల వలే) అంత అవసరం.

జీవిలో మెదడు వలె కార్యనిర్వాహకులు సంఘ క్షేమ దృష్టితో పని చేయవలెను. ఆ మెదడు సరిలేక చురుకుదనం కోల్పోయినను, సరిగా పనిచేయలేక పోయినను, ఆ జీవి జీవనం లోపభూయిష్టం. తన మనుగడ కష్టం, చూపలరుల కయిష్టం, సర్వభ్రష్టం, చివరకు తనకే నష్టం కల్గును. అట్లే కార్యనిర్వాహకులకు బాధ్యత, చురుకుదనం తగ్గి కార్యనిర్వహణలలో అలసత్వం ఏర్పడితే సంఘ పరిస్థితి అంతే.

దీనికి తోడుగా శరీర భాగములన్నియు వాని వాని నిర్దేశిత కార్యక్రమములను సక్రమముగా, సకాలములో నిర్వర్తించి, మిగిలిన శరీర భాగములు మెదడు కందించినట్లే దిగువ శాఖలన్నియున్నూ సేవా దృక్పథంతో తమ విధులను సక్రమంగా, సకాలంలో, సంపూర్తి చేసి, పై శాఖలకు, కేంద్రమున కందించుట ముఖ్యావశ్యకము. ఈ శాఖలు పనిచేయుటకు మూలాధారము కణరూపమైన సంఘ సభ్యులు. నేటి సంఘములలో హక్కులకై పోరాడటమే హెచ్చు. బాధ్యతల నిర్వహణ స్వల్పము. శైశవావస్థలో నున్న మన సంఘమునకిది చేటు, మనుగడకే అపకారమగును.

ఈ సందర్భముగా చిన్ననాడు చదువుకున్న ఒక కథలో తిరిగే కాళ్ళు, చూచే కళ్ళు, తీసుకువచ్చే చేతులు, నమిలే నీరు, జీర్ణం చేసే కడుపు, పరస్పరం కీచులాడుకుని ఎవరికి వారే గొప్పగా భావించుకొని, కర్తవ్య బాధ్యతల విస్మరించుటచే ఆహారమే లేక ఆ జీవి నశించినట్లు చదివినాము. అదే దృష్టితో మన సంఘ జీవికి కూడా అన్ని శాఖల, అందరు వ్యక్తుల సహకార, సహాయములు అవసరమని సర్వులకు, సుస్థిర మనుగడకు సవినయముగా మనవి

చేసుకొనుచున్నాను. చెట్టులోని ఆకులు సహకరించక, ఆహారము తయారుచేయక మానినా, వేరులు ముడి పదార్థమును గ్రహించి ఆకుల కందించకపోయినా, కాండము, ముడిపదార్థములు ఆహారము, వేళ్ళు, ఆకుల మధ్య సంధానకర్తగా పరస్పరము అందించకపోయినా ఆ చెట్టు పుష్పించదు, ఫలించదు, జీవించదు. జాతి వృద్ధి చెందదు - మన సంఘ వృక్షమునకు కేంద్రము వేళ్ళు, ఆకులు సంఘీయులు, శాఖలు మూలము (కాండము) సంఘములోని శాఖలు. సంఘశ్రేయస్సునకు మన సంఘీయులెల్లరు ఇది గ్రహించి మసలుకొనవలసినదిగా నా మనవి.

"బాహూరాజన్యఃకృతః" సంఘరక్షణకు రాజులు బాహువుల వంటివారు (రాజులు పురుషోత్తముని బాహువులనుండి పుట్టినవారు) బాహువులలో ముఖ్యభాగం హస్తం. ఏ ప్రమాదమునుండి రక్షణకైనా బాహువులు ముందుకొస్తాయి. దుమ్ము వచ్చినా అవే అడ్డం నిలుస్తాయి. శత్రువు వచ్చినా అవే ఎదుర్కొంటాయి. అయితే యిక్కడ ఒక్క విషయం గ్రహించాలి. శత్రువును ఎదుర్కోవాలంటే 5 వేళ్ళూ కలిసి సమష్టిగా ముష్టిగా ఏర్పడతాయి. ధూళి వేస్తే వేళ్ళు విడిగా ఒకదాని ప్రక్కన ఒకటి విస్తరించి కంటిని కాపాడతాయి. ఇదే ఆదర్శంతో విభిన్న పేర్లతో ఉన్న సంఘాలన్నీ ఒకే గొడుగు క్రిందకు వచ్చి వాని మనుగడకు భంగం లేని విధంగా సమష్టిగా సంఘాన్ని పటిష్టపరచే విధంగా, వ్యూహ రచన చేసుకొని ఆచరించటం, ఆశయాల సిద్ధికై అహరహం పని చేయవలసినదిగా ప్రార్థన.

అసంకల్పిత నాడీమండలములోని శరీర భాగముల వలే కార్యనిర్వాహకులు వారి స్వీయ కార్యక్రమములకు భంగము లేకుండా నిరంతరము సంఘ కార్యములను నిర్వర్తించుట ముదావహము, శ్రేయస్కరము. దానికిగానూ 'వాల్ వాక్స్' (Volvox) ఏక కణ జీవ సముదాయములో వలెనే చీమలు, తేనెటీగలు మొదలగు సంఘజీవుల వలెనే కార్య భారమును అందరు కలిసి వ్యష్టి స్వేచ్ఛకు భంగము లేని విధంగా సమష్టి సంఘ బాధ్యతా భారమును స్వీకరించి ప్రతి వ్యక్తి (సంఘీయుడు) శక్తి కొలది కృషి చేయగలరని ఆశిస్తూ అందుకై నాకు తోచిన విధముగా సంఘ బాధ్యతలను విభజించి శాఖలు ఏర్పడుటకు అవసరమగు అంశము నీ క్రింద పొందుపరచుచున్నాను. బుద్ధికుశలురగు మీకేమైన అంశములు తోచినచో తెలుప ప్రార్థన.

ఏనుగు తినే గడ్డిపరకలైనా సమష్టిగా మెలివేసిన 'వెంటు' ఆ ఏనుగును బంధిస్తుంది. ఒక పుల్లనైతే విరిచివేయవచ్చు, నాల్గు పుల్లలూ కలిసి "మోపు"గా ఉంటే విరచటం కష్టం. "బలవంతమైన సర్పము చలిచీమలచేత చిక్కిచావదె సుమతీ" అన్న శతకకారునిని స్మరిస్తూ, పదవుల కోసం, స్వార్థంతో పార్టీలను ముక్కలు చేసే రాజకీయ నాయకుల వలే సంఘాన్ని ముక్కలు చేయకుండా, విభిన్న శాఖలు ఒకే గొడుగు క్రింద ఐక్యంగా ఉండి సమస్యలను

సామరస్యంగా, సర్వశ్రేయోదాయకంగా, సుముఖంగా పరిష్కరించుకోగలరని ఆశిస్తున్నాను. "సంఘోరక్షతి రక్షితః" అని గుర్తించి, సంఘం మనకేం చేస్తున్నది ? చేస్తుంది ? అనికాక మనం సంఘానికి ఏం చేశాం ? ఏం చేస్తున్నాం ? అసలేం చేయాలి ? అని ఆలోచించి ముందడుగు వేయండి.

ప్రతి కుటుంబము పత్రికకు జీవిత చందా / సంవత్సర చందా చెల్లించుటద్వారాను, ఇతరులను తన పలుకుబడితో చందాదారులుగా చేర్పించుట ద్వారాను పత్రిక చందాదారుల సంఖ్య పెరిగినచో మరిన్ని అంశములతో, మరింత పుష్టికరముగాను, మరింత ఉపయోగకరముగాను పత్రికను నడుపుకొనుచు అనేక నూతన విషయములను మనము తెలుసుకొన వీలగును. చందాల సంఖ్య గణనీయంగా పెరిగినచో పత్రిక ఖరీదు తగ్గుటకు కూడా కొంత వీలు పడవచ్చును. ప్రతి వైఖానసుడు ఈ పత్రిక తనదిగా భావించి, కృషి చేసి, భాసింపజేయగలరని ఆశిస్తున్నాను.

శాఖీయులందరు కృషి చేసి పత్రికను పరిపుష్టం చేసి అందీక్రింది అంశములతో శోభాయమానము, ఉపయుక్తము, ఆదర్శప్రాయము చేయుట సంఘ శ్రేయోదాయకము.

అంశములు :

1. చరిత్ర : స్వశాఖీయులలో లబ్ధ ప్రతిష్టల చరిత్రలను, ఫొటోలు, వారి సేవా రంగములు, ఆదర్శములు తెల్పు చార్టులు పెద్దవిగా సంఘ సమావేశములలో ప్రదర్శించుట, పత్రికలో వీలు ప్రకారం ప్రకటించుట.

2. జనాభా (సంఖీయుల వివరములు) : ప్రతి గ్రామంలోను గల వైఖానస కుటుంబములు, వారి వివరములు (పేరు, ఇంటి పేరు, గోత్రం, సంతానం వివరాలు, వివాహ సంబంధ, విద్యా ఉద్యోగ విషయక వివరములు వగైరాలు) ప్రాంతీయ శాఖల కార్యకర్తలు సేకరించి, పై శాఖ కందించుట. అట్లే పట్టణములలోని ఇతర రాష్ట్రములు, దేశములలోని స్వశాఖీయుల వివరములు, ప్రాంతీయులు సేకరించుట, వారినుండి పత్రిక చందాదారులను చేర్పించుట ప్రాంతీయ కార్యకర్తల కర్తవ్యముగా భావించి కృషి చేయుట అవసరము.

3. సంఘ శాఖలు : ప్రతి గ్రామ, పట్టణ, మండల శాఖలు, జిల్లా, రాష్ట్ర శాఖలు, జాతీయ, అంతర్జాతీయ శాఖలు ఏర్పడి కార్యకర్తలు చురుకుగా పనిచేసి ప్రతి స్థాయినుండి హక్కులు బాధ్యత లెరిగిన కార్యవర్గము లేర్పడి పనిచేయుటద్వారా సంఘము పటిష్టమగును. Society above self-sacrifice and service మన ధ్యేయంగా ప్రతి కార్యకర్త ముందుకు సాగి, సంఘ సభ్యులకు ఆదర్శమై నడిపించాలి.

4. సభ్యత్వ రుసుము : ప్రతి వైఖానసుడు సభ్యుడుగా చేరి, నిర్ణీత సభ్యత్వ రుసుము చెల్లించి సంఘమునకు తోడ్పడవలెను. అందు కొంత శాతము పై సంఘము లన్నియు సమష్టి అవగాహనతో నిర్ణయించుకున్న దామాషా ప్రకారము విభజించుకొని ఆ యా శాఖా నిర్వహణకుపయోగించుకొనవలెను.

5. ప్రతి శాఖా బాధ్యతలు : ప్రతి శాఖలోను ఒక్కొక్క అంశములో నిష్ణాతులైన పెద్దల సలహా, సహకారములతో ఒక కమిటీ ఏర్పరచుకొని వారి సహాయమున ఈ క్రింది రంగములలో కృషి చేయుచు అవసరమైనవారికి, వారి ఖర్చుపై సందేహము సమస్యలకు సమాధాన సమాచారముల పంపుచుండుట, ముఖ్యమైనవానిని పత్రికలో ప్రకటించి సర్వుల దృష్టికి తీసుకొనివచ్చుట. ఇందు నాకు తోచిన రంగములీ క్రింద వ్రాయుచున్నాను. ' a) ఆగమము - ఆచారములు b) ఆశ్రమము - దేవాలయము' c) ఆర్థిక విషయములు d) కళలు e) న్యాయము - చట్టము f) మంత్రములు - యంత్రములు g) విద్య - విద్యాలయము h) వైవాహిక సంబంధాలు, i) శిశు, మహిళా విభాగములు, j) సమాచారము - సహాయము, k) ప్రచారము - పత్రిక, l) సారస్వతము - గ్రంథాలయము m) సాంఘిక సేవ n) ప్రాచీన గ్రంథ సేకరణ - ముద్రణ, o) ఇతర విషయములు - పై స్థాయిలోని శాఖలు ప్రతి రంగమునకు ఒక కమిటీని వేసుకొనవచ్చును.

6. గ్రంథాలయం : ప్రాచీన గ్రంథమును సేకరించి, లేక గ్రంథములను ఉదారుల సాయముతోను, సహకారముతోను ముద్రించి, ఉపయుక్త, ధార్మిక, అన్యభాషా గ్రంథములను తెలుగులోనికి తర్జుమా చేయించి ముద్రింపించి, కావలసినవారకి విక్రయించి, గ్రంథాలయము నిర్వహించి పఠనాసక్తులకు వీలు కల్గించుట.

7. ప్రవర్తన : ఆచార్యులు శబ్దము ధర్మమైన, శాస్త్రబద్ధమైన ఆచారములను తానాచరించుచు ఇతరుల కాదర్శప్రాయుడై వారిచే ఆమోదింపజేయువాడిని తెల్పును. మన అలంకరణలలో, ఆచారములలో ప్రవర్తనలోను ధర్మబుద్ధితో, శాస్త్రబద్ధత క్రమశిక్షణాయుత, సత్సీలత ప్రతిబింబించేలా చూచుకోవాలని మనవి.

8. రాజకీయం : రాజకీయాలకు దూరంగా ఉంటూ విధి నిర్వహణ సక్రమ మార్గంలో నిర్వర్తిస్తూ దైవానికి చేరువుగా జీవించగలరని ఆశిస్తున్నాను. స్వామికి నిత్యం మధుపర్క నివేదన చేస్తున్నాం, అట్టి మధువులాంటి మనసును వృద్ధి చేసుకొనుట మనకు, సంఘానికి మంచిది.

9. వ్యక్తి - సంఘం : ఏ వ్యక్తి సంఘానికి దూరంగా ఉండరాదు. సంఘం ఏ వ్యక్తిని తన పరిధినుండి విడువరాదు. ఈ అనుసంధానానికి ప్రతి సభ్యుడూ తన బాధ్యతగా భావించి స్థానిక కార్యకర్తలకు సహకరించాలి. ప్రతి వ్యక్తి తన శక్తి కొలది ఆర్థిక సాయం చేయాలి. కార్యకర్తలు ప్రోత్సహించాలి.

పాఠకులు, కార్యకర్తలు, సభ్యులు ఈ సూచనలను సహృదయతతో స్వీకరించి సహాయ సహకారము లందించి, సంఘ పటిష్టతకు తమ వంతు కృషి చేయవలసినదిగాను, ఇందేవైనా లోపములున్నచో మన్నించి, మార్పులు సూచించి తోడ్పడవలసినదిగా అభ్యర్థిస్తున్నాను.

ఒక చిన్న కథ

పత్రికా నిర్వహణ పూలబాట కాదు. అట్లని ముళ్లకంపా కాదు. పత్రికా నిర్వాహకులకు ఓర్పు, సహనము, చాలా అవసరము. అంటే ఇతరులకు అవి రెండూ లేకపోయినా ఫరవాలేదని కాదు. ప్రతి వ్యక్తికీ, అందునా సమాజ సేవ చేసే ప్రతివారికీ అవి మంచి లక్షణాలే. కోపతాపాలు, ఈర్ష్యాసూయలు కూడ సహజ ప్రవృత్తులే. వాటిని అదుపాజ్ఞలలో పెట్టుకోవాలని శాస్త్రాలు చెబుతాయి. అనుభవం గలవారు, పెద్దవారు కూడా నేర్పిస్తారు. అయినా క్షణికావేశాలు వాటిని బహిర్గతం చేస్తాయి. ఈ వేదాంతమంతా ఎందుకంటారేమో.

కొందఱి వద్దనుంచి పత్రికకు చందా కట్టుట నిలిపివేస్తామని జాబులు వస్తుంటాయి. అది వారి స్వ నిర్ణయము. అయితే ముందుగానే జాబు ద్వారా ఎందుకు వ్రాస్తున్నట్లు. ఏదో ఒక అసంతృప్తి. ఆ అసంతృప్తిపై ఒక బెదిరింపు లేఖ వ్రాస్తారు. ఇట్టి లేఖలకు తిరుగు సమాధానం వ్రాయలేమనియూ, అందరినీ తృప్తి పరచుట అదియూ అన్నివేళలా వీలుపడదనియూ మనవి చేయుచున్నాను.

పత్రిక నడుపుట ఒక ఆశయసిద్ధి కొఱకే. ఆ ఆశయం ఏమిటనేది ముందుగానే నిర్ణయించబడుతుంది. శ్రీ వైఖానస పత్రిక ఆధ్యాత్మిక మాసపత్రిక. వైష్ణవభక్తినీ, వైఖానస సాంప్రదాయాలను ప్రచారము చేస్తూ సనాతన ధర్మ ప్రచారము చేయుట దాని ఆశయము. దీనిపై అపేక్ష గలవారు సలహాలు పంపిన స్వీకరించబడును. పత్రికాభివృద్ధి చేయబడును. దీనికి వ్యతిరేకించి వచ్చిన సూచనలు గాని, లేఖలు గాని పరిగణనలోనికి తీసుకొనబడవని సవినయముగా తెలియపరచుచున్నాము.

ఈ సందర్భముగా మా మిత్రుడు చెప్పిన ఒక సంఘటనను ఒక చిన్న కథగా తెలుపుచున్నాను.

రాజేష్ అనునతనిది ఒక పల్లెటూరు. అచ్చట వాగులు, సెలయేర్లు, తోటలు, ఉద్యానవనములు, చల్లనిగాలి/పరిశుద్ధమైన నీరు, ప్రశాంత వాతావరణము కలదు. అతని తల్లితండ్రులు లక్ష్మీ, నారాయణులు ఎంతో అల్లారుముద్దుగా అతనిని పెంచినారు. అతను ఆధునిక విద్యలు చదివి ఉద్యోగ ధర్మముగా అతని కర్మానుసారము తిరుపతిలో కాపురముంటున్నాడు. వాళ్ల వూరికి ఏనాటినుంచో రైలు మార్గము కలదు. బస్సులో వెళ్లినచో కొంత దూరము ఆ అడవి మార్గములో పోవలసి యుండును.

ఆ వూరి స్టేషనులో ఎక్స్‌ప్రెస్ రైళ్లు కూడ ఆగుతాయి. ఈ మధ్య ఆ వూరి మీదుగా లోకల్ రైలు కూడ trail run గా వేసినారు.

ఒకరోజు రాజేష్ తిరుపతిలో రైల్వే స్టేషనులో రిజర్వేషన్ కౌంటరుకు వెళ్లినాడు. అక్కడ ఎక్కువసేపు వేచి ఉండటం, చివరకు రిజర్వేషన్ దొరక్కపోవటం, అక్కడెవరూ అతనిని మర్యాదగా, గౌరవంగా చూడకపోవటం జరిగింది. తన స్వంత వూరిలో అతని కెప్పుడూ ఆనందానుభూతే గాని వేఱుగా వుండేది కాదు. అందుచే రైల్వే స్టేషనులో తనకు

అవమానం జరిగినట్టుగా భావించాడు. వాళ్లపై కోపం వచ్చింది. సాటివారు రిజర్వేషను సంపాయించటంతో వారిపై ఈర్ష్య, అసూయలు కలిగాయి. యింకేముంది అసంతృప్తి జండా ఎగురవేశాడు. శపథం చేశాడు. యికముందు జీవితంలో రైలు ప్రయాణము చేయనన్నాడు.

అతని మిత్రులంతా చాల బాధపడ్డారు. ఎన్నో విధాల చెప్పి చూశారు. రైలులో పోకపోతే యితరత్రా బస్సు వగైరాలు సౌకర్యము లేదు. ఆలస్యంగా పోవచ్చు. అర్ధరాత్రిలో పోవచ్చు. ఆగిపోవచ్చు. అక్కడ నుండి దట్టమైన అడవి మార్గంలో అందులోనూ రాత్రిపూట స్వగ్రామం చేరటం శ్రమతో కూడిన పని అని చెప్పారు. అట్లా పోలేకపోతే దోవలో బంధువుల యింట్లో వుండిపోతానే గాని రైలులో పోనని మొండిపట్టు పట్టాడు. చివరగా ఆప్తులు, చెప్పగా చెప్పగా ఒక షరతు పెట్టాడు. అదేమంటే రైల్వే శాఖామంత్రి క్షమార్పణ చెప్పాలి. లేదా తిరుపతిలో రిజర్వేషన్ కౌంటరు ఎత్తివేయాలి అని, తిరుపతిలో రిజర్వేషన్ కౌంటర్ ఎంతో శ్రమతో పెట్టించి, అది ఆధునిక పద్ధతులలో నడపించబడుచున్నది. దానిని మూసేస్తే ప్రజలందరికీ యిబ్బంది కలుగుతుంది.

అందుకే అతని మిత్రులంతా సమావేశమై ఒక నిర్ణయం చేశారు. రైల్వే మంత్రిగారు ఏ పెళ్లిలో గాని, ఏ సభలో గాని, ఏ ప్రదేశములో కనిపించినా, దైవ దర్శనానికి వచ్చినా వారిని కలుసుకోవటం, వారికి తమ మిత్రుని ప్రతిజ్ఞ చెప్పి రైల్వే కౌంటరు వారు చేసిన పనికి క్షమార్పణ కోరటం. అది ఆలస్యమవుతోంది. అంతా కలసి ఒక యోచన చేసినారు. Trains at a glance పుస్తకంలో ప్యాసింజరు రైళ్లు రాకపోకలు లేవు. ప్యాసింజరులో, లోకల్ ట్రయిన్స్‌కు రిజర్వేషను కౌంటర్‌కు పోనక్కరలేదు. గనుక మిత్రుని ప్యాసెంజరులోనో లేక లోకల్ రైళ్లలోనే ప్రయాణం చేయవచ్చని చెప్పారు. ఆలస్యంగానైనా క్షేమంగా చేరవచ్చునన్నారు. అందరూ కోపించి యిలా వెళ్లటం మానేస్తే టిక్కెట్లు తీసేవారు లేరని ఆదాయం లేదని కొత్తగా వేసిన లోకల్ రైలు bi-weekly యో, weekly యో చేస్తారని లేక రద్దు చేస్తారని నచ్చచెప్ప చూచారు.

రాజేష్ ఆ మాట వినలేదు. తనకు దేశమంటే అపరిమితమైన భక్తియనీ, ప్రజలంటే మిక్కిలి అభిమానమనీ, అందుకే రైల్వే మంత్రి రాజీనామా గాని, న్యాయ విచారణగాని కోరలేదనీ అంటాడు. తన మిత్రులు తన దేశభక్తినీ, తన ఆవేదననూ అర్థం చేసుకోలేక పోతున్నారంటాడు. యీ సమస్య త్వరలో తీర్చాలని అతని ఆప్తుల, మిత్రుల ఆవేదన.

ఇదీ సంఘటన.

యిందులో కొంత కొంత ప్రతివారికీ అనుభవమే. త్వరలో రాజేష్ వైకుంఠ తుల్యమైన తన స్వగ్రామమునకు చేరే వుపాయం ఆలోచించి, ఆనందంగా వుండాలని కోరుకుంటాము.

డి. వికసాచార్యులు
S.V.D.S.V. సభ

అత్రి మహర్షి పవిత్ర చరిత్ర

(97 డిశంబరు సంచిక తరువాయి)

శ్రీ నారాయణం వెంకట రామాచార్యులు, పాన్నూరు.

అత్రి మహర్షిని పృధు చక్రవర్తి సన్మానించుట

పృధు భూపతి, యజ్ఞ అశ్వమును, దిగ్విజయమునకయి, వదలిపెట్టు సమయమునకు, అత్రి మహర్షి వచ్చెను. వచ్చిన అత్రిని గౌరవించి, నమస్కరించి, మహాత్మా! అశ్వరక్షకుడుగ వెళ్లుచున్న నా పుత్రునకు తమరు పరిరక్షకుడుగా వెళ్లవలయునని, పృధువు కోరెను. అత్రి అంగీకరించి, ఆశీర్వదించి, విజయ యాత్రకు వెళ్లెను. ఆ స్థితిలో ఇంద్రుడు, అసూయతో, పాషండ వేషమున, యజ్ఞాశ్వము నపహరించి, ఆకాశగమనము చేయుచుండ ఇంద్రుని, అత్రి సహాయమున పృధు పుత్రుడు గమనించి, బాణము వేయుటకు వెరచుచుండ, యువరాజా ! యజ్ఞ హంతకుని చంపిన, పాపము రాదు, శత్రువు మీద శరప్రయోగము చేయమని, అత్రి హెచ్చరికజేయ, యువరాజు బాణ ప్రయోగము చేసెను. శరఘాటికి తట్టుకొనలేక అశ్వమును వదలి ఇంద్రుడు పారిపోయెను. ఇట్లు ఇంద్రుని నుంచి, రెండుమార్లు అశ్వమును రక్షించుకొని వచ్చి, యజ్ఞాశ్వమును తండ్రికి అప్పగించి జరిగిన విషయమును చెప్పెను. అప్పుడు పృధు చక్రవర్తి అత్రిని కొనియాడి, యజ్ఞమును పూర్తిజేసెను. తదుపరి, మహర్షుల సన్మానించు సమయమున పృధుని, నీవు ఇంద్రాదుల కంటే గొప్పవాడవని అత్రి స్తుతించెను. అందుకు గౌతమాదులు, ఒక మానవుని యిట్లు పొగడుట ధర్మవిరుద్ధమనిరి, అప్పుడు సనత్కుమారుడు నా విష్ణుః పృధివీపతిః అని పెద్దలన్నారు గనుక పృధు చక్రవర్తి స్తుతించుట ధర్మమేనని తీర్మానించెను. అంతట మహర్షులందరిని, ఘనముగ సన్మానించి, ఆశీస్సులు పొందిన పృధు చక్రవర్తి, ప్రత్యేకించి అత్రి మహర్షికి ధనకనకాదులిచ్చి గౌరవించెను. పృధుని యాశీర్వదించి, అత్రి ముని తన ఆశ్రమమునకు చేరుకొనెను. అనసూయకు తాను వెళ్లి వచ్చిన సంగతులన్ని చెప్పెను. దారా పుత్రులతో సుఖశాంతుల కొంతకాలమున్న తరువాత పెద్దవారయిన పుత్రులకు ధన కనకాదులను సమానము పంచియిచ్చి ఆశీర్వదించి, అత్రి అనసూయలు, వానప్రస్థ ధర్మమున జీవితము గడుప పుత్రులను వదలి, వనమునకేగి, ప్రశాంత జీవితమున తపస్సు చేయుచుండిరి.

అత్రి మహర్షి సూర్యచంద్రులను కాపాడి రాక్షసులను భస్మము చేయుట

ఒక సమయమున, జంభాసురాది రాక్షసులు, దేవతలు, యుద్ధము చేయుచుండ అసురులు ప్రయోగించిన, రాహు వాస్త్రమున, సూర్య చంద్రులు తేజో హీనులయినందులన లోకము గాఢాంధకారమయినది. అప్పుడు అసురులు విజృంభించి దేవతలను భాదించ, దేవతలు అత్రి మహర్షిని శరణుజొచ్చి, రక్షింప వేడుకొనిరి. అంతట అత్రి తన తపోశక్తితో, సూర్యచంద్రుల క్షతగాత్రులు కాకుండా చేసి ఒక హుంకారమున నిశాచరులను భస్మముజేసెను. దేవతలు రక్షింపబడిరి, అత్రి మహర్షి వలన క్షేమమొందితిమని, అత్రిని శ్లాఘించి, దేవతలు వెళ్లిపోయిరి. ఇటుల అత్రిముని తన తపశ్శక్తితో జేసిన లోక రక్షణ కార్యక్రమములెన్నియో గలవు. కనుకనే అత్రి మహర్షి, తన పేరునకు నిర్వచనము తానే ఇట్లు చెప్పెను.

శ్లో॥ అరాత్రిరత్రిః సారాత్రిర్యాంనాధీతె తిరద్యనై, అరాత్రిరత్రిత్యేవనామ మొవిద్ధిశోభనే !

నేను లోకములను కామాదుల వల్ల కలిగిన పాపములనుండి అనేక విపత్తులనుండి రక్షించునుగాన, నా పేరత్రి యగును. మరియు రోజుకు ముమ్మారు వేదమును పఠించుటచే రాత్రిళ్లను కూడా పగళ్లు జేసితిగాన, నేను వేదాధ్యయము జేయని రాత్రి లేదుగాన, నా పేరు అత్రియని తెలుసుకొనుము: అయాచితవ్రతము అపరిగ్రహ వ్రతములాచరించిన నిష్కామ యోగి అత్రిముని.

(సశేషము)

శ్రీ వైఖానస ధర్మ చంద్రిక

'శ్రీ వైఖానస ధర్మ చంద్రిక మరియు వైఖానసారోపిత దేవలకత్వ నిరాకరణమ్' అను ఈ చిన్న పుస్తకము 1914 ఆగష్టులో శ్రీ పెద్దింటి నారాయణాచార్యులువారి వలన ప్రకటింపబడినది.

1906 సం॥లో కృష్ణా జిల్లా, భీమవరం తాలూకా చెరుకుమిల్లి గ్రామములో గ్రామపురోహితులు వైఖానసులకు "విష్ణుపాత్ర" యివ్వకూడదని ఆక్షేపణ చేసిరి. దానిపై 4-2-1906 తేదీన పెద్దాపురం జమీందారుగారైన శ్రీ శ్రీ రాజావత్సవాయి శ్రీ రాయజగపతిరాజు బహద్దరుగారు వ్రాయించిన పత్రికయిది. వైఖానసులకు దేవలకత్వము లేదని శాస్త్ర ప్రమాణములచే చూపబడినది.

ఇయ్యది గ్రామములందున్న వైఖానసార్చకులకు ఉపయోగపడగలదు. దీని జిరాక్సీ కాపీనాకందించినవారి పేరు గుర్తు రాలేదు. వారికి కృతజ్ఞతలు.

D. వికసనాచార్యులు,
కార్యదర్శి, S.V.D.S.V. సభ, తిరుమల

శ్రీ రామాయనమః

పీఠిక

పెద్దాపురనివాసస్థలయిన మహారాజ రాజశ్రీ శ్రీరాజా వత్సవాయి శ్రీరాయ జగపతిరాజు బహద్దూరుగారు కృష్ణాజిల్లా భీమవరం తాలూకా చెరుకుమిల్లి నివాసస్థలయిన శ్రీదాట్ల పెదమంగరాజుగారి పేర శ్రీ వైఖానస పూజ్యతను గూర్చి వ్రాయించిన పత్రిక.

స్మృతిరత్నాకర ధర్మశాస్త్రే అధసూత్రాణి అగ్ని వైశ్యసూత్రే

అథాతస్సూత్రగణాన్వ్యాఖ్యాస్యామోబోధాయనమావస్తంబంసత్యాషాఢం ద్రాహ్యాయణమాగస్త్యం శాండిల్యమాశ్వలాయనం శామ్భవీయం కాత్యాయనమితి నవానిపూర్వసూత్రాణి, వైఖాననంశౌనకీయం భారద్వాజ మాగ్నివైశ్యం జైమినీయం వాధూలం మాధ్యందినం కౌండిన్యం కౌషీతకమితి నవాన్యపరసూత్రాణి, అష్టాదశసంఖ్యా తాశ్శరీర సంస్కారాఇతి.

తా॥ బోధాయనసూత్రము, ఆపస్తంబసూత్రము, సత్యాషాఢము, ద్రాహ్యాయణము, ఆగస్త్యము, శాండిల్యము, ఆశ్వలాయనము, శామ్భవీయము, కాత్యాయనము, అనియీతొమ్మిదిపూర్వ సూత్రములు. వైఖాననము, శౌనకీయము, భారద్వాజము, అగ్ని వేశ్యము, జైమినీయము, వాధూలము, మాధ్యందినము, కౌండిన్యము, కౌషీతకము, అని యీ తొమ్మిది అపరసూత్రములు వెరశిపదునెనిమిది. శరీరసంస్కారార్థమై చెయ్యబడిన సూత్రములు-

ఏతేషాంసూత్రాణాంమధ్యే వైఖానససూత్రం ప్రతి
శ్రీ బ్రహ్మాండపురాణాదిసూక్తాः శ్లోకాःలిఖ్యంతె.

తా॥ యీ సూత్రములలో వైఖానససూత్రము విషయమై శ్లోకములను వ్రాయుచున్నాము-

శ్లో॥ వైఖానసంపాంచరాత్ర మితివిష్వాగమావుభౌ ।
తత్ర వైఖానసంముఖ్యతమ మిత్యుచ్చతేబుధైः ॥

తా॥ వైఖానసము, పాంచరాత్రము, అనివిష్వాగమములు, రెండు. యీ రెండింటిలో వైఖానస సూత్రము ముఖ్యమని పండితులచే చెప్పబడుచున్నది.

శ్లో॥ వైఖానసస్యసూత్రస్య చాగ్నేశ్చామణకస్యచ ।
నారాయణస్య వేదస్యమహత్వంనావబుధ్య తే ॥

తా ॥ వైఖాననసూత్రము యొక్క, శ్రామణకాగ్ని యొక్క, నారాయణ మనేవేదభాగముయొక్క మహిమ వివరింపనశక్యమైనది.

శ్లో॥ యధాసర్వేమువేదేమ సామవేదప్రశస్యతే ॥
తధాసూత్రేమ సర్వేమ సూత్రమేతత్ప్రశస్యతే ॥

తా॥ అన్ని వేదములలో సామవేదమువలెనే, అన్ని సూత్రములో నీ సూత్రము శ్లాఘింపబడినది.

శ్లో॥ అగ్ని ర్వైఖానసం సూత్రం 'విష్ణుర్వేదాశ్చ శాశ్వతా
గాయత్రీ వైష్ణవావిప్రాస్చ త్రైతేపవిత్రకాः ॥

తా॥ అగ్ని హోత్రము, వైఖానససూత్రము, శ్రీ విష్ణుదేవుడు, శాశ్వతమైన వేదములు, గాయత్రీ మంత్రము, విష్ణుభక్తులు, బ్రాహ్మణులు వీరేడ్వురు మిక్కిలి పవిత్రులు.

కాలమాధవీయే, ఉపోద్ఘాత ప్రకరణే

శ్లో॥ వైఖానసాద్యాగమోక్త దీక్షాంప్రాప్తోహివైష్ణవः ॥

తా॥ వైఖానసాగమోక్త ధర్మమునవలంబించువారు వైఖానస వైష్ణవులు.

స్మృతి ముక్తాఫలే

శ్లో॥ పాంచరాత్రాద్యాగమోక్త దీక్షాం ప్రాప్తస్తు వైష్ణవ ः ॥

తా॥ పాంచరాత్రాగమోక్తదీక్షను వహించినవారు పాంచరాత్ర వైష్ణవులు

వైఖానసవైష్ణవ శ్రేష్టతను గూర్చి శ్లోకములు

"శ్రీ బ్రహ్మాండపురాణె అర్థపంచకవివరణె అర్చావతారసూచక ద్వితీయాధ్యాయే"

శ్లో॥ శబ్దతాత్పర్యవిజ్ఞాన విహీనత్వాదసూయయా ।
విత్తార్థంపూజయంతీతి యాజకాన్ దూషయంతియే ॥
తేషాంతునరకేవాసో యావదాచంద్రతారకం॥

తా॥ శబ్దార్థాభిప్రాయమును తెలియక అసూయచేత విత్తమును గ్రహించి దేవుని పూజించుచున్నారని అర్చకులనెవరు నిందింతురో వారికి ఆ చంద్రతారకముగా నరకమందు నివాసము కలుగును.

శ్లో॥ యాజకాఏవమద్భక్తామచ్ఛరీరంహియాజకాః ।
యేజనాస్తాన్వినిందంతి భవంతిమమనిందకాః ।

తా॥ అర్చకులే మా భక్తులు. నాశరీరమువంటివారున్ను, వారిని నిందించినవారు నన్ను నిందించినవారుగా నెంచబడుదురు, అనిభగవద్వచనము.

శ్లో॥ యేపూజయంతిమద్భక్తాన్యాజకాన్ సుసమాహితాః ।
మమైవపూజాంతాంబుధ్వా దాస్యామిపరమంపదం ॥

తా॥ నాభక్తులయిన అర్చకులను శ్రద్ధగా పూజించినవారికి ఆ పూజ నాదిగా భావించి వారికి నాలోకమునిచ్చెదను.

శ్లో॥ అన్నవస్త్రం ధనంవాపియాజకానాం దదాతియః ।
తన్మమైవహిదత్తంస్యా ద్వర్ధతేవటబీజవత్ ।
తస్మైదాస్యామ్యహంవిప్ర తత్సలేనపదంమమ ॥

తా॥ అన్నముగాని, వస్త్రముగాని, ధనముగాని, మా యర్చకులకు యివ్వబడినది నానిమిత్తమే యివ్వబడినదగును. ఆ దానఫలమువటబీజము వలె వృద్ధిబొందును, ఆదాతకు నాలోకమునిచ్చెదను.

శ్లో॥ మద్యాజకానాంయోదద్యా న్మహాదానాదికం నరః ।
ఫలంకోటిగుణందత్వా దదామిపరమంపదం ॥

తా॥ యేనరుడు మాయర్చకులకుమహాదానాదికమును యిచ్చునో ఆ దాతకు మేముకోటిగుణముగా ఫలము నివ్వడమే కాక మాపరమపదమును కూడా యివ్వగలము.

శ్లో॥ అర్చకంతోషయేద్విష్ణుం యస్తోషయతుమిచ్ఛతి ।
తుష్టేర్చకే జగన్నాథ స్తుష్టఏవ నసంశయ ः ॥

తా॥ విష్ణుప్రసాదము కోరినవాడు అర్చకుని సత్కరింపవలెను. అర్చకుడు సంతుష్టుడైతే జగన్నాథుడు సంతుష్టుడగును.

ఈపైనిప్రాసినశ్లోకములవల్ల వీరి సూత్రము శ్రేష్ఠమయినదని, ఈ సూత్రస్థులు పూజ్యులని తెలియగలదు. వీరికి దేవలకత్వము లేదు. దేవలకులు యెవరనగా :-

-విష్ణుధర్మోత్తరే-

శ్లో॥ చండికాయాశ్చదుర్గాయా జ్యేష్ఠాయాభైరవస్యచ ।
రుద్రస్యపూజకాయేతు తేవై దేవలకాస్మృతా ः ।

తా॥ చండికను, దుర్గను, జ్యేష్ఠను, భైరవుని, రుద్రదేవుని, పూజించువారు దేవలకులని చెప్పబడుచున్నారు.

శ్లో॥ "దేవాజీవస్తుదేవలః" అనే సామాన్యవచనమునుబట్టి దేవ పూజచేసినవారు అందరున్ను దేవలకులేయని, సాత్వికాది పురాణవివేకము లేక, తామసపురాణములను మాత్రముచూచి కొందరు సామాన్య పండితులున్ను, విష్ణుమత ద్వేషమునుబట్టి, మరికొందరున్ను, వీరిని దేవలకులని నిందించుచు ఆధునిక గ్రంథములలో కొన్ని నిందావచనములు

వ్రాసియున్నారు. "దేవాజీవస్తుదేవలః" అనే సామాన్యవచనము చేత సామాన్యులకు భ్రాంతికలుగుననే యుద్దేశ్యముచేతనే వృద్ధహారీతాది మహర్షులు యీ భ్రాంతి నివారణార్థము స్పష్టముగా వ్రాసియున్నారు. ఆవచనము లెవ్వియనగా :

వృద్ధహారీతస్మృతౌ

శ్లో॥ **వైఖానసాస్తుయేవిప్రాః హరిపూజనతత్పరాః ।**
నతేదేవలకాఃప్రోక్తాః హరిపాదాబ్జసంశ్రయాత్ ॥

తా॥ శ్రీహరినిపూజించే వైఖానసబ్రాహ్మణులు శ్రీహరి పాదాబ్జ సంబంధము వలన దేవలకులు అని చెప్పబడరు.

స్మృతిరత్నాకర ధర్మశాస్త్రే

శ్లో॥ **యేనకేనప్రకారేణ విష్ణోరారాధనంపరం ।**
తస్మాద్దేవలకత్వంతు నవిష్ణవిషయేక్వచిత్ ॥

తా॥ యేప్రకారము చేతనయినను, అనగా ధనము పుచ్చుకుని గాని పుచ్చుకొనకగాని విష్ణ్వారాధనము చేయుట పరమ శ్రేయస్కరము. అందు వల్ల విష్ణ్వారాధన విషయములో దేవలకత్వము లేదు.

"సచ్చరిత్ర సుధానిధౌ"

శ్లో॥ **వత్సరత్రయమర్ధార్ధం యఃపూజయతిదేవతాం ।**
వినా నారాయణం దేవం సహి దేవలకస్మృత ॥

తా॥ శ్రీనారాయణదేవుని వినాగా ఇతర దేవతను మూడు సంవత్సరములు ధనాపేక్షచే పూజించువారు దేవలకు లనబడుచున్నారు. శ్రీ నారాయణదేవుని పూజించువారికి దేవలకత్వదోషము లేదు.

సామాన్యులకు భ్రాంతి నివారణ నిమిత్తము పూర్వ మహర్షులు యీ ప్రకారముగా విశదీకరించినారు.

తామసపురాణములలోనున్ను, వాటిననుసరించి చేసిన ఆధునిక గ్రంథము లలోనున్ను వ్రాసియున్న నిందా వాక్యములు యీపయి మూడుశ్లోకముల వల్లనున్ను, పరిహరింపబడుచున్నవని గ్రహించవలెను.

పాద్మేసాత్వికాదిపురాణవిభాగ ఃశ్లో॥ **వైష్ణవంనారదీయంచ తథాభాగవతంపరం ।**
గారుడంచతథాపాద్మం వారాహంశోభనంస్మృతం ।
సాత్వికానిపురాణాని శోభనానివరాననే ॥

స్వాతికపురాణములు

తా॥ 1 వైష్ణవము, 2 నారదీయము, 3 భాగవతము, 4 గారుడము, 5 పాద్మము, 6 వారాహము. యీ పురాణములు సాత్వికపురాణములు.

రాజసపురాణములు

శ్లో॥ బ్రహ్మాండంబ్రహ్మకైవర్తం మార్కండేయంతదైవచ ।
భవిష్యద్వామనం బ్రాహ్మం రాజసానినిబోధమే ॥

తా॥ 1 బ్రహ్మాండపురాణము, 2 బ్రహ్మకైవర్తము, 3 మార్కండేయము, 4 భవిష్యోత్తరము, 5 వామనము, 6 బ్రాహ్మం. యీ పురాణములు రాజసపురాణములు.

తామస పురాణములు

శ్లో॥ శైవమాగ్నేయకంచైవ లైంగంస్కాందంతధైవచ ।
కౌర్మంచైవ తధామత్స్యం తామసాని ప్రచక్షతే ॥

తా॥ 1 శైవపురాణము, 2 ఆగ్నేయపురాణము, 3 లింగపురాణము, 4. స్కాందపురాణము, 5 కూర్మపురాణము, 6 మత్స్యపురాణము. యివి తామసపురాణములు.

సాత్వికపురాణములలో విష్ణూపాసనోర్ధ్వపుండ్ర చక్రధారణాది ధర్మములనుగూర్చి స్తుతివాక్యములున్ను, రుద్రార్చనతిర్యక్పుండ్రలింగ ధారణాది ధర్మములనుగూర్చి నిందావాక్యములున్ను, విశేషముగా నున్నవి.

తామస పురాణములలో రుద్రార్చన తిర్యక్పుండ్ర లింగధారణాదికమును గూర్చిస్తుతి వాక్యములున్ను, చక్రాంకణమును గూర్చిన్ని అర్చకులను గూర్చిన్నీ నిందావాక్యములు కలిగి యున్నవి.

సాత్వికధర్మములు ప్రాజ్ఞులకు గ్రహించతగినవిన్ని తామసధర్మములు వర్జించతగినవిగానున్నవి.

విష్ణుధర్మోత్తరే

శ్లో॥ మధ్యమోరాజసోధర్మః తామసస్త్వధమస్మృతః ।
సాత్వికస్తూత్తమోజ్ఞేయ స్తస్మాత్సాత్వికమాచరేత్ ॥

తా॥ రాజస ధర్మములు మధ్యమములు, తామస ధర్మము లధమములు, సాత్వికధర్మము లుత్తమమైనవి గనుక సాత్విక ధర్మముల నవలంబించవలయును.

రాజస తామసపురాణ ధర్మములున్ను సాత్విక పురాణ ధర్మములకు వ్యతిరేకించకుండా వున్నంతమట్టుకు గ్రాహ్యములు. వ్యతిరేకధర్మములు త్యాజ్యములు. సాత్వికశాస్త్రోక్తధర్మముల నవలంబించిన వారు పూజ్యులు.

సాత్వికధర్మముల నవలంబించినవారు పూజ్యులనుటవల్ల తామస పురాణధర్మముల నవలంబించిన తిర్యక్పుండ్ర ధారులు నింద్యులాయని శంక గలుగుచున్నది.

ఇందుకు సమాధానము

శ్లో॥ బాహ్యమభ్యంతరంచేతి వైష్ణవం ద్వివిధంస్మృతం ।
చక్రాదిధారణబాహ్య మాంతరం హరించింతనం ॥

తా॥ వైష్ణవము : బాహ్యము, అభ్యంతరము అని రెండు విధములు. చక్రాదిధారణము, బాహ్యవైష్ణవము, హరిచింతనము, ఆంతర వైష్ణవము. ఆంతరవైష్ణవమనె హరిచింతనమువల్ల తిర్యక్పుండ్ర ధారులున్ను పూజ్యులై యున్నారు.

ప్రస్తుతము యీ సాత్వికధర్మముల ననుసరించి, శ్రీరంగము, శ్రీ వేంకటాద్రి, శ్రీకాంచీపురము, శ్రీపెరుంబుదూరు, శ్రీతిరుపల్లిక్కేణి మొదలయిన స్వయంవ్యక్తాది దివ్యస్థలములలో సాత్వికాచారములయొక్క అనుష్ఠానమును, అర్చకులయొక్క గౌరవమున్ను, చూచినవారికి స్పష్టముగా తెలియగలదు. గనుక గ్రామపురోహిత వాక్యములను విశ్వసింపక పైనవ్రాసిన ప్రకారం సాత్వికశాస్త్రోక్తధర్మము నవలంబించిన వైఖానస వైష్ణవులను పాంచరాత్రావలంబులయిన శ్రీ వైష్ణవులనువలె పూజించడము న్యాయమైయున్నది కాబట్టి మేమున్ను వారిని పూజించుచునే యున్నాము. ఈ విషయమై యింకా అనేక ధర్మశాస్త్రవచనములున్నప్పటికి గ్రంథవిస్తరభీతిచే నింతటితో విరమించడమయినది.

4-2-06 విశ్వావసునామ సం॥ర మాఖ శు ౧౦ ఆదివారం.

వైఖానసారోపిత దేవలకత్వ నిరాకరణం

వైఖానసానాం దేవలకత్వమ స్తీతివాదినః

వైఖానసదుష్టతావాదినః

వైఖానసానాం దేవకత్వం నా స్తీతివాదిన :

వైఖానస శిష్టతావాదినః

వైఖానసానాం దేవలకత్వమస్తివా నాస్తివేతిప్రశ్న కుత్తరముగా వైఖానసులకు దేవలకత్వం లేదని ఈ క్రింద వ్రాసిన ప్రకారము స్మృతిరత్నాకరంలో శ్లోకముల నున్ను, హారీతస్మృతి శ్లోకములనున్ను శిష్టతావాదులు వ్రాసినారు.

స్మృతిరత్నాకరే

శ్లో॥ ఆగమోక్తవిధానజ్ఞో । రుద్రకాళ్యుపజీవక : ।
శుద్ధ దేవలకోనామ । సర్వకర్మవిగర్హితః ।
ఆర్షోక్తేనవిధానేన దేవలత్వం నవిద్యతే ।
తస్మాత్సర్వ ప్రయత్నేన । దైదికేనైవపూజయేత్ ॥

(అత్రిః)

శ్లో॥ వైదికేనైవవిధినా । దంభలోభవివర్జితః ।
పూజయేద్భక్తితో విష్ణుం । సహిదేవలకోనహి ।

విష్ణుధర్మోత్తరే

శ్లో॥ చండికాయాశ్చదుర్గాయా । జ్యేష్ఠాయా భైరవస్యచ ।
రుద్రస్య పూజకాయేతు । తేవై దేవలకాస్మృతా : ॥
యేనకేనప్రకారేణ । విష్ణోరారాధనంవరం ।
తాస్మాద్దేవలకత్వంతు । నవిష్ణువిషయేక్వచిత్ ॥

హరీత స్మృతౌ

శ్లో॥ వైఖానసాస్తుయేవిప్రా । హరిపూజనతత్పరా : ।
నతే దేవలకాఃప్రోక్తా । హరిపాదాబ్జసంశ్రయాత్ ॥

దుష్టతావాదులీ శ్లోకములను జూచి యేవిధమైన సంకోచమూలేకుండా, నక్షత్రసూచి, జ్యోతిశ్శాస్త్రపారంగతుల నాక్షేపించునట్లు, తస్యపుటస్యోపరిభాగలిఖిత ద్వితీయ తృతీయ పంచమ షష్ఠశ్లోకాః పూర్వ పక్షాః ॥అనిన్ని॥ తామువ్రాయబోయే, పురాణశ్లోకములకగ్రభాగమందు ఉత్తరె॥ అనిన్ని వ్రాసి కొన్ని పురాణశ్లోకములున్నూ, కొన్ని కల్పిత శ్లోకములున్నూ, కొన్ని మృగ్యమూలశ్లోకములునూ, వ్రాసినారు. యెంతగొప్పపండితులైనను, హారీతాదిస్మృతిశ్లోకముల నాక్షేపింపజాలరు. యీదుష్టతావాదులు తస్యపుటస్యోపరి। అని వ్రాయుటచేతను, ఏతచ్ఛబ్ద తచ్ఛబ్దభేదమున్నూ, ఉత్తరె । అని వ్రాయుటచేత లింగవచన భేదములున్నూ, కనిపెట్టలేని పండితంమన్యులని స్పష్టమగుచున్నది. రత్న పరీక్ష తెలియనివారికి మరకతమాణిక్యముల కంటె పచ్చరాయి మంచిదిగా తోచును. గనుక వీరలీలాగున వ్రాయుట యుచితమే. యెంత గొప్ప స్మృతులనున్నూ వీరు ఖండించగలరు.

(వీరు వ్రాసిన శ్లోకములలో)

స్మృత్యర్థసారే

శ్లో॥ **ప్రథమోయాజ్ఞవల్క్యచ । ఆపస్తంబోద్వితీయక ः ।**
ఆశ్వలాయనస్తృతీయశ్చ । సత్యాషాఢశ్చతుర్థక ः ।
పంచమోమూలఘటికో । షష్ఠోవాజసనేయిక ः ।
సప్తమోహిరణ్య కేశీ । అష్టమస్తుహరద్విజः ।
నవమోవైఖానసఃప్రోక్తः । దశమోజైనిబ్రాహ్మణ ः ॥

అని వ్రాయడము వల్ల హరిద్విజులు అష్టమతరగతిలోవారున్నూ, వైఖానసులు నవమతరగతిలో వారున్ను, అయినారు, గనుక, హరద్విజుల కంటె వైఖానసులు, అధమతరగతిలోవారని, వీరియభిప్రాయముగదా ॥

పాఠక్రమమే ముఖ్యమైనయెడల, ప్రథమ తరగతిలో చేరిన యాజ్ఞవల్క్య బ్రాహ్మణులకంటె ఆపస్తంబాది బ్రాహ్మణులు అధమ తరగతిలోవారు కావలెను.

(ఉదాహరణము)

శ్లో॥ **శత్రుఘ్నో భరతశ్చ పార్శ్వదళయో ः ।**

అని యుండుటచేత భరతులకంటే శత్రుఘ్నులు జ్యేష్ఠులు కావలసి యుండగా కనిష్ఠులైనారు. యిందుకు దుష్ట తావాదులు జవాబు చెప్పవలెను. వీరు వ్రాసిన శ్లోకములలోనే

(దేవలకలక్షణం స్మర్యతేగౌతమేన)

శ్లో॥ **దేవార్చనపరోవిప్రో । వితార్థంవత్సర త్రయం ।**
సవై దేవలకోనామ । హవ్యక వ్యేమవర్జిత ः ॥

ధనార్థమై మూడు సంవత్సరములు దేవతార్చన చేసినవిప్రుడు దేవులకుడని యీ శ్లోకార్థము కదా అనేక సత్రములలోనున్నూ, అనేక బ్రాహ్మణోద్యోగస్థుల గృహములయందున్నూ

నెలకు రూ. 3,4 మూడు నాలుగు రూపాయల చొప్పున జీతము పుచ్చుకుంటూ దేవతార్చనచేస్తూ దేవతార్చన బ్రాహ్మణుడని ప్రసిద్ధి పొందుతూవున్న బ్రాహ్మణులందరున్నూ యీ దుష్టతావాదులకు బంధువులై యున్నారు. వీరిదేవలకత్వం యేలాగు నివర్తించును.

మహదతిక్రమ ः । కాత్సేన్యానాత్మనిఫలతి ॥

అనే న్యాయము చేతను వీరికే దేవలకత్వము సిద్ధించినది. యిందుకున్నూ వీరు జవాబు చెప్పవలెను.

(సిద్ధాంతము)

ధర్మశాస్త్రములు, సాత్వికములు, రాజసములు, తామసములు అని మూడువిధములు. యీలాగుననే పురాణములున్నూ మూడు విధములు. తామసస్మృతి కంటె రాజసస్మృతి ప్రబల ప్రమాణము, రాజస తామసముల కంటె సాత్విక స్మృతి పరమ ప్రమాణము.

(యిందుకు నిదర్శనము)

(స్మృతిరత్నాకరే)

శ్లో॥ సాత్వికై రేవవర్తేతసాత్వికోక్తం సమాచరేత్ ।
రాజసంతామసంచైవ । దూరతఃపరివర్జయేత్ ॥

(శ్రీ విష్ణు ధర్మోత్తరే)

శ్లో॥ మధ్యమోరాజసోధర్మః తామస్త్వధమస్మృతః ।
స్వాతిక స్తూత్తమోజ్ఞేయః । తస్మాత్సాత్వికమాచరేత్ ॥

(కించ)

శ్లో॥ శ్రుతిస్మృత్యోర్విరోధేతు ।శ్రుతిరేవ బలీయసీ ।
అవిరోధేతధాకార్యం । స్మార్తం వైదికనత్సదా ॥

యీలాగుననే స్మృతిపురాణములకు విరోధము కలిగినప్పుడు స్మృతి వాక్యమే ప్రబలప్రమాణము గనుక సాత్వికమైన హారీతస్మృత్యాది శ్లోకములవల్ల తామసపురాణ శ్లోకములు ఖండించబడినవని తెలుసుకోవలెను. విశేషించి దేవలకత్వము కంఠగతామ కపిద్ధమువలె దుష్టతావాదులను బాధించుచున్నది. వైఖానస శిష్టతనుగూర్చి శతశః ప్రమాణములున్నవి. పండితమన్యులకు యెన్ని ప్రమాణములు కనుపరచిననూ బధిర గాంధర్వగీతమువలె నిష్ప్రయోజనము గనుక (ఆలమస్థాన సంరంభేణ) అను న్యాయముచే నింతటితో విరమించడమైనది.

ది. 21 - 2 - 1902. ద॥ రాజా వత్సవాయి,

పెద్దాపురం. రాయజగపతిరాజుగారు.

ద్వైతాద్వైత విశిష్టాద్వైత లక్ష్మీవిశిష్టాద్వైతములు

శ్రీమాన్ అత్తిలి గోపాలకృష్ణమాచార్యులు, నర్సాపురం

(చతుర్మతమర్మభేదములు)

I.ద్వైతము : "ద్వయోఃభావః = ద్వితా। ద్వితైవద్వైతమ్" (అనఁగా,రెండింటియొక్క భావము "ద్విత", "ద్వితయే" "ద్వైతము") ఇచ్చట "ద్వయోఃʼʼ అనగా - "జీవేశ్వరయోఃʼʼ (జీవుడు - ఈశ్వరుడు అను రెండింటియొక్క) అని గ్రహింపదగును. ఫలితార్థమేమనగా, జీవేశ్వరులిద్దరును ప్రత్యేక తత్త్వములనియు, వానికి (ఆ జీవేశ్వరులకు) ఐక్యము (ఏకత్వము = ఒక్కటియే యనుట) ఎంతమాత్రము లేదనియు సిద్ధాంతము చేయబడుటచే "ద్వైతము" అను మత (వాద) మన్వర్థమగుచున్నది. స్థూల సూక్ష్మ చిదచిద్విశిష్టమైన చైతన్య ద్వయమున నైక్యమును గల్పింపకుండుట, జీవులు బ్రహ్మమును పొందిన పిమ్మట, ముక్తత ఒవ స్థయందు వీరు పొందెడు ఆనందమఖండము గాక, వారి వారి యోగ్యతలను బట్టి న్యూనముగా గాని, లేదా అధికముగా గానియుండుట, జీవులీలోకములోని రూపముతోడనే, ముక్తతా ఒవస్థయందుండుట అను చిన్న చిన్న భేదములున్నను, ఈ ద్వైత సిద్ధాంతము విశిష్టాద్వైతము కంటె అభిన్నమైయున్నది.

ఇందున్నట్లుగా, కొన్ని లోపములను కొందరు (అద్వైతులు) చూపుచున్నారు. నిర్గుణాత్వాదికమును బోధించు శ్రుతులను, అక్షరపరబ్రహ్మమును బోధించిన తరువాత ఉదాహరింపబడిన గీతావాక్యము సమన్వయము స్వారసికమైయుండదనియు, శైవులు మున్నగువారు శివాది దైవములను పరతత్త్వముగా అంగీకరించి, తక్కిన యన్నింటియందును వైష్ణవుల మార్గమునే అవలంబింపక వీరికి వేరొక దారి లేదనియు, ముక్తులు కూడా కైంకర్యమును కానరాకుండుటచే వారికి (సేవకులకు) అఖండానందానుభవము ప్రాప్తింపదనియు, వీరి మోక్షము సంసారము వంటిదే యనియు, లోపములుగా ఉద్ఘాటించి, ద్వైతమునద్వైతులాక్షేపింతురు.

ద్వైత సిద్ధాంత స్థాపకుడు - "అనంద తీర్థులు" లేక - "మధ్వాచార్యులు" వీరు ఉడిపి యందుండి (ద్వైత) మత ప్రచారము చేయసాగిరి. వీరికి "పూర్ణప్రజ్ఞులు" "వ్యాస తీర్థులు" మున్నగు నామధేయములెన్నో యున్నవందురు. మధ్వగురు పరంపరలో సుప్రసిద్ధులు చాలమందియున్నారు. సత్యతీర్థులు, పుణ్యతీర్థులు ఆక్షోభ్య దేశికులు, వ్యాసరాయలు మున్నగువారు పేర్కొనదగినవారు. పంచాంగాలలో వీరి జన్మనక్షత్రము, సిద్ధి నొందిన దివసము వేరువేరుగా వ్రాయబడియుండును. వీరికి భారతదేశములోని చాలచోట్ల పీఠములు, పీఠాధిపత్యములు ఉన్నవి. ఉత్తరాది పీఠము మొదలగు పీఠములు ప్రసిద్ధములు. ఈ శాఖీయులకు "మాధ్వులు" అని వ్యవహరింతురు.

మాధ్వ పండితులు - మధ్వాచార్యులు నరేసరి; ప్రస్థానత్రయమునకు (అనగా బ్రహ్మసూత్రములు, ఉపనిషత్తులు, భగవద్గీత - అనువానికి) తమకు తమకనుకూలముగా భాష్యవ్యాఖ్యానదులు వ్రాసుకొన్నారు. "జీవేశ్వరులు భిన్నులు"' అని వీరి సిద్ధాంతము. వీరికి హనుమంతుడుపాస్య దైవము. విష్ణువును కూడ వీరు ఆరాధింతురు.

II. అద్వైతము : పైన పేర్కొన్నదానికి (=ద్వైతమునకు) భిన్నమైనది అద్వైతము. ద్వైతము జీవ బ్రహ్మ భేదమును చెప్పచుండగా అదికాదని ఖండించి, జీవబ్రహ్మత్వమును ఈ అద్వైతము స్థాపించుచున్నది. అఖండానంద రూపము, త్రికాలాబాధ్యమునగు చైతన్యమే పరబ్రహ్మము. అదియొకటియే సత్యము. జ్ఞానముచే జీవులు సత్యము కాని యే ప్రపంచమును సత్యమనుకొని భ్రాంతి చెందుచున్నారు. "బ్రహ్మ సత్యం; జగన్మిథ్యా" అని వీరెరుంగరు. (నద్వైతం = అద్వైతము) ఈశ్వరుడు కూడ జగత్తువంటివాడే అను భ్రాంతికి మూలము - "అవిద్య"

ఈశ్వరుని వివర్తరూపమే జగత్తని వీరందురు (వివర్తమనగా - వస్తుతత్త్వము నశింపక, వేరొక రూపమును పొందుట. ఉదా : స్వర్ణాభరణములు, నీటిలోని బుడగలను, సుడులు, అలలు) సత్తు (existing one) అనిగాని, అసత్తు (= non-existing) అనిగాని నిరూపింప శక్యముగాని బ్రహ్మముయొక్క శక్తియైన మాయ యందావేశించిన బ్రహ్మచైతన్యమే యీశ్వరుడు. జీవుడును, అవిద్యా ప్రతిబింబిత చైతన్యమే మాయ దర్పణము వంటిది; బ్రహ్మము సూర్య తేజస్సు వంటిది. అద్దమునుండి ప్రతిబింబించు వెలుతురు వంటివారు - జీవేశ్వరులు. ఈశ్వరుడు జగత్సమిష్టి రూపి; జీవులు వ్యష్టిరూపులు జీవులు అవిద్యా ఽధీనులు; లేక, మాయా ఽధీనులు ఈశ్వరుడు మాయా ఽతీతుడు, లేక స్వాధీనమాయకుడు.

"తత్త్వమసి", "అహంబ్రహ్మాస్మి" - అను వాక్యములు జీవేశ్వరాభేద వాదము నంగీకరించుటయే గాక బలపరచుచున్నవి. సత్యమనగా - "బాధరాహిత్యము" అనియు, "అసత్యమనగా - అశాశ్వతత్త్వము" అనియు, "పంచదశి యందు విద్యారణ్యులు వ్యాఖ్యానించిరి. మరియు, త్రికాలాబాధ్యత్వము లేకపోవుటచే జీవేశ్వరులు సత్య పదార్థము కావనియు, అద్వైతశ్రుతులట్లే వక్కాణించుచున్నవనియు, విద్యారణ్యులే సిద్ధాంతీకరించియున్నారు.

భారతదేశములో శంకర పీఠములు అయిదు గలవు. అన్ని పీఠములకు అధిపతులుండి, అద్వైత ప్రచారము చేయుచుందురు. సురేశ్వరాచార్యులు, పద్మపాదుడు, హస్తామలకులు మొదలగువారు.

III. విశిష్టాద్వైతము : "విశిష్టంచ, తత్అద్వైతంచ = విశిష్టాద్వైతమ్" అనగా "విశిష్టమైన అద్వైతము = విశిష్టాద్వైతము") అని అర్థమును చెప్పవచ్చును. అయితే, "ఆ విశిష్టత యేది ?" అను ప్రశ్న రాకమానదు; దానికి సమాధానము చెప్పకతప్పదు (కొందరు

విశిష్టస్య - అద్వైతము = విశిష్టాద్వైతమ్" అనగా "విశిష్టునియొక్క అద్వైతము = విశిష్టాద్వైతము" అని విగ్రహవాక్యమును చెప్పుదురు) రామానుజుడు విశిష్టాద్వైత స్థాపకుడు. చేతనాచేతన విశిష్టలు బ్రహ్మముయొక్క అద్వైతమని, విశిష్టాద్వైతమున కర్థము. "నిజమునకు - చిత్తు, అచిత్తు అను తత్త్వ ద్వయము లేనే లేదనీ, బ్రహ్మమొక్కటియే సత్యమని చెప్పు నితర మతమును నిరసించి "జీవుడు - ఈశ్వరుడు - ప్రకృతి" అను "తత్త్వత్రమము" సత్యమని చెప్పటయే విశిష్టాద్వైతముయొక్క సారాంశము. "న్యాయ సిద్ధాంతమునందు "అశేషచిదచిదాత్మకం బ్రహ్మైకమేవతత్త్వం....." ఇత్యాది ప్రమట్టికములో స్పష్టీకరింపబడినట్లుగా - "తత్త్వ త్రయము సత్యము; ప్రమేయము; ఈ మూడును అభిన్నములే" అని గ్రహింపదగును.

రామానుజుడును, ప్రస్థానత్రయమునకు "విశిష్టాద్వైత"పరముగా భాష్యములు వ్రాసెను. వానిలో, బ్రహ్మసూత్ర భాష్యమునకు "శ్రీభాష్యమని" పేరు. దీనిపై "శ్రుత ప్రకాశిక", మున్నగు వ్యాఖ్యానములు, వేదాంతదేశికుల "అధికరణమాల" అను పద్యరూప వ్యాఖ్యానము ప్రసిద్ధములు. రామానుజ సంప్రదాయానుయాయులు చాలమంది యున్నారు. చరవరముని, పరాంకుశులు, వేంకటనాథ వేదాంతదేశికులు, యామునాచార్యుడు మున్నగువారు ముఖ్యులు. జీవేశ్వరులకు "శేషిశేషభావమును" రామానుజ సంప్రదాయవేత్తలు అంగీకరింతురు. వీరు - "జీవుడుకించిజ్ఞుడు; ఈశ్వరుడు సర్వజ్ఞుడు" అందురు.

సూక్ష్మచిదచిద్విశిష్ట చైతన్యమునకును, స్థూల చిదచిద్విశిష్ట చైతన్యమునకును భేదము లేక, వీరికేకత్వమును సిద్ధాంతీకరించుటచే, "విశిష్టాద్వైత" నామధేయమన్వర్థమౌచున్నది. (వీనిలో మొదటిది - నామము పాద విభాగము చేయుటకు శక్యము కానిది. రెండవది - అట్టి విభాగము చేయుటకు శక్యమైనది) విశిష్టాద్వైతులు "విష్ణుపారమ్యమును" విశ్వసింతురు. వీరు విష్ణువు (నారాయణుడు) కంటే భిన్నులైన అన్యదైవములనారాధింపరు. జీవుడు భక్తిప్రపత్తులచే ముక్తుడై, భగవత్సాన్నిధ్యము పొంది, తత్కైంకర్యమును మానక, దివ్య దేహముతో శాశ్వత పరమపదమును పొందునని వీరి సిద్ధాంతము.

IV. లక్ష్మీ విశిష్టాద్వైతము : లక్ష్మీదేవితో కూడియున్న (=అనగా, ప్రకృతి లేక, మాయతో కూడియున్న) విష్ణువే (= పరమ పురుషుడే) మోక్ష ప్రదాన సమర్థుడనియు, భక్తులకు ముక్తి ప్రాప్తిని గల్గించుటకై భగవానునకు లక్ష్మి సహకరించునని యీ సిద్ధాంతమునందలి ప్రత్యేక లక్షణము. అంతేకాదు; లక్ష్మీసహితుడయిన విష్ణువే ఆరాధ్యుడనీ, కేవల విష్ణ్వారాధనము వల్ల మోక్షము నులభప్రాప్యము కాదనీ, ముక్తిప్రాప్తికై భగవద్యజనరూపమై, లక్ష్మీనారాయణారాధనైతానమైన "అర్చనము" అను సాధనము వలననే భక్తుడు వ్రయత్నింపవలయుననీ, "జప-హోమ-ధ్యానా-ర్చనములు" అను నాల్గును సమాశ్రయణమార్గములనీ, "పంచసంస్కారము"లనబడు తాపాదులు ఆవశ్యకము కావనీ, అవి తాంత్రికులకే కాని - పరమవైదికులకు కావనీ, అజ్ఞానార్భలోభాదులచే తపాదికమైన సమాశ్రయణము తాంత్రికేతరులకు ప్రాయశ్చిత్తావశ్యకతను జెప్పుచున్నదనీ - నిష్కర్షచేయుట యీ సిద్ధాంత సారాంశము. విఖనసమునివరుడు, భృగ్వాదులైన తచ్ఛిష్యులు, శ్రీనివాసదీక్షితేంద్ర వేదాంత దేశికులు, నృసింహ వాజపేయయాజి, భట్టభాస్కరుడు మున్నగుమహనీయు లెల్లరు

నీలక్ష్మీ విశిష్టాద్వైత సిద్ధాంతములను తమ తమ రచనల యందు విశదీకరించి, మహోపకారముగావించిరి.

లక్ష్మీవిశిష్టాద్వైత సిద్ధాంతానుయాయులే - ఔఖేయులు, వారే - వైఖానస శాఖీయులు. వీరికి అన్యదేవతా ప్రతిష్ఠా ఉత్సవాదులు విహితములు కావు. అట్లని, వీరన్య దేవతావిద్వేషులు కారు. వీరిలో భేదములు లేవు - వీరు మతమును స్వీకరించుట, తమ మతము నితరులకు ఇచ్చుట - అనువాని నెరుంగరు. బ్రహ్మసూత్రములపై - శ్రీనివాస దీక్షితేంద్రులు "లక్ష్మీవిశిష్టాద్వైతభాష్యమును" వ్రాసిరి. ఈ గ్రంథము, 1896 లో మద్రాసులోని "శ్రీనికేతనము ముద్రాక్షరశాలలో తెలుగు లిపిలో ముద్రింపబడినది. ఇదిగాక, "పారమాత్మికోపనిషద్భాష్యమును" కూడ వీరు వ్రాసిరి. "లక్ష్మీ విశిష్టాద్వైత భాష్యమునకు - సుందర రాజనిర్మితమైన "నిగమాది దర్పణ వాఖ్యానము" "పారమాత్మిక భాష్యమునకు" సుందరాజచంద్రిక, భట్టభాస్కర వ్యాఖ్యానము గలవు. ఇది మొదట కుంభకోణములో గ్రంధాక్షరములలోను, అడయారు - ఢిల్లీలలో నాగరాక్షరములలోనూ, నల్లూరులోని "శ్రీ వైఖానస భాగవచ్ఛాస్త్ర గ్రంథమాల" యందు ఆంధ్రాక్షరములలోను ముద్రాపితమైనది.

ఈ వ్యాసము - విషయ వివరణమునకు మాత్రమేగాని - వివాదమునకు, స్వమతాధిక్య ప్రకటనమునకు ఎంత మాత్రము కాదని మనవి చేసికొనుచున్నాను.

నైమిశారణ్యస్థిత శ్రీభూసమేత వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవము

బహుధాన్యవత్సర జ్యేష్ఠ శు॥ ౮ ప్రభృతి శు॥ ౧౨ పర్యంతం

(ది. 2-6-98 నుండి 6-6-98 వరకు)

పావన నైమిశారణ్యంలో **శ్రీ వేంకటేశ్వర స్వామివారికి బ్రహ్మోత్సవము** జరుపబడును.

5-6-98 శ్రీ స్వామివారి కళ్యాణోత్సవము

6-6-98 అవభృధోత్సవము

వైఖానస కులస్వాములు మన జన్మక్షేత్రమైన నైమిశములోని శ్రీస్వామివారి సన్నిధిలో చతుర్వేదమంత్ర పారమ్మాతిక, కల్ప సూత్రాదులు విన్నవించి, దర్శించి, పాదసేవ లొనర్చి తరించగలరు.

వివరములకు : **అగ్నిహోత్రం రంగాచార్యులు**, అధ్యక్షులు,
శ్రీవైఖానస సమాజమ్, 29-1-19, శేషాద్రి శాస్త్రి వీధి,
గవర్నరు పేట, **విజయవాడ - 520 002.** ఫోన్ : 435393

వార్తలు

వైఖానస యూత్ పార్లమెంటు

ది 11-1-1998 ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్, ఆంధ్ర మహిళా సభ హాలులో వైఖానస యూత్ ఫోరం భాగ్యనగర్ శాఖవారు (శ్రీ స్వామి వివేకానంద జయంతి సందర్భంగా) యూత్ పార్లమెంటును జరిపినారు. ఈ కార్యక్రమమునకు శ్రీమాన్ పెద్దింటి శేషాచార్యులు గారు అధ్యక్షత వహించినారు.

ముఖ్య అతిధి శ్రీ వేదాంతం రామకృష్ణమాచార్యులు గారు, విజయవాడ వైఖానస సంస్కృతి, సంస్కారములు, విష్ణుబలి ప్రాశస్త్యము, శ్రీ వైఖానస పత్రిక గురించి మాట్లాడినారు. అత్యంత ప్రతిభా పాటవాలు కనబరచిన శ్రీమాన్ మాల్యవంతం శ్రీనివాస్ - చార్టర్డ్ అకౌంటెంట్‌గారికి, కుమారి అగ్నిహోత్రం మాధవీలత, వైఖానసులలో ప్రథమ మహిళా సబ్‌ఇన్‌స్పెక్టరుగా ఎన్నికైనవారిని వైఖానస యువ పురస్కారం అందజేసి గౌరవించారు

కాకినాడలో జరిగిన అర్చక పరీక్షల సందర్భములో 200 మంది విద్యార్థులకు 17, 18 తేదీలలో శ్రీ వైఖానస సంక్షేమ సేవా సంఘము, కాకినాడ వారు ఉచిత భోజన సౌకర్యము ఏర్పాటు చేసినారు.

విఖనస తాంబూలములు

★ గుంటూరు జిల్లా, కొమరవల్లిపాడు వాస్తవ్యులు శ్రీమాన్ మురికిపూడి రవికుమార్‌గారు ది. 26-11-97 న సకుటుంబముగా తిరుమల యాత్ర చేసిన సందర్భముగా శ్రీ వైఖానస పత్రికకు విఖనస తాంబూలం రు. 58/- లు సమర్పించిరి.

★తూర్పు గోదావరి జిల్లా కొంకుదురులో వేంచేసియున్న శ్రీ వేణుగోపాల స్వామివారికి ది. 25-12-97 న. శ్రీ సైనాన్సు కంపెనీవారిచేత, శ్రీమాన్ వాడపల్లి శేషావతారం, కరకుదురువారి ఆధ్వర్యమున లక్ష తులసీ దళార్చన జరిపించిన సందర్భంలో శ్రీ వైఖానస పత్రికకు విఖనస తాంబూలం రు. 120/- లు సమర్పించిరి.

★ పశ్చిమ గోదావరి జిల్లా, ఉండ్రాజవరం వాస్తవ్యులు శ్రీమాన్ చక్రవర్తుల నారాయణాచార్యులుగారు, వారి నూతన గృహ ప్రవేశ సందర్భంగా శ్రీ వైఖానస పత్రికకు విఖనస తాంబూలం రు. 58/- లు సమర్పించిరి.

★గుంటూరు జిల్లా, తుమ్మపూడి వాస్తవ్యులు శ్రీమాన్ తమిరిశ శేషాచార్యులుగారి ఏకైక పుత్రిక చిరంజీవి లక్ష్మీ సౌభాగ్యవతి హేమలతకు, ప్రకాశం జిల్లా వల్లూరు వాస్తవ్యులు లేటు నారాయణం వెంకట రమణాచార్యులుగారి కనిష్ఠ పుత్రుడు చిరంజీవి వెంకట శేష శ్రీనివాస్‌లకు వివాహ నిశ్చితార్థ సమయమున శ్రీ వైఖానస పత్రికకు ఉభయులు కలిపి విఖనస తాంబూలం రు. 66/- లు సమర్పించిరి.

★ ప్రకాశం జిల్లా, పేరాలలో వేంచేసియున్న శ్రీ పాండురంగస్వామి వారికి ది. 7-2-98 న లక్ష తులసీ దళార్చన, అమ్మవారికి లక్ష కుంకుమార్చన జరిపిన సందర్భంలో ఆలయ అర్చకులు శ్రీమాన్ దీవి సత్యనారాయణాచార్యులుగారు శ్రీ వైఖానస పత్రికకు విఖనస తాంబూలం రు. 58/- లు సమర్పించిరి.

భాగవత పద్యగాధావళి

దశావతారములు

(8) శ్రీ కృష్ణావతారము

(గత సంచిక తరువాయి)

రచన:
శ్రీ కాలనాధభట్ట వీరభద్రశాస్త్రి

పద్మనాభసుతుడు ప్రద్యుమ్నుడతని త
నయుడగు అనిరుద్ధ నామకుండు
తండ్రి, తాతలవలె తరుణుల మానస
మలరజేయునట్టి అందగాడు 619

శోణపురివిభుండు బాణాసురుడువేయి
కరములు గలవాడు కఠిన తపము
చేసివరము పొందె శివుడు రాచనగరి
కోటగుమ్మమందు కొలువుచేయ 620

అతని పుత్రిక ఉష అనిరుద్ధునివలచె
చిత్రరేఖయనెడి చెలియ, మాయ
విద్యచేత తెచ్చె విష్ణుపౌత్రుని, ప్రేమ
జంటనట్లు కలిపె సంతసమున 621

కాలమెటుగడిచెనో కాసింత కననట్టి
వారి ప్రేమ ఫలము పండెను, ఉష
కునెల తప్పగ జనకుడెరిగెను, కోప
మందెను, అనిరుద్ధు బందిచేసె 622

నారదముని వలన నారాయణుడువిని
దండు వెడలె రోష ధాము డౌచు
శోణపురినిగాచు శూలపాణి హరిని
అడ్డగించె లోని కరుగకుండ 623

వాసుదేవ! నేను బాణుని కిచ్చిన
మాట వలన వాని కోట నెపుడు
కాపుగాయవలయు గాన నన్ను జయించి
గాని నీవు లోని కరుగలేవు 624

అనగ వల్లెయనుచు అచ్యుతుడు శివుని
తోడపోరసాగె తుదకు భవుడు
మూర్ఛనొందె; హరిని మూర్ఛనజాలక
పారిపోయెపురికి బాణుడపుడు 625

శూలపాణి మూర్ఛతొలగగా లేచెను
మరల శౌరి తోడ పోరిఓడె
నరికెబాణు వేయి కరములు కృష్ణుడు
బాణుని వదలమని భవుడువేడె 626

బాణుడు ఉషకు హరి పౌత్రుడౌ అనిరుద్ధు
తోడ పెళ్ళిచేసె వేడుకలర
కయ్యమంత మయ్యె వియ్యముగా మారె
హరిహరులు ప్రమోదమందగాను 627

కొత్త దంపతులను కూడి ద్వారకచేర
సంతసంబునొంది స్వాగతంబు
పలికిరట రమణులు బంధుమిత్రులు వధు
వరులు మురియగ మృదుభాషణమున 628

×××

అతడు బీద బాపడతడు కుచేలుడు
వాసుదేవుడతని బాల్యమందు
గురుకులాన చదువు కొనెడి సమయమందు
కలసిమెలసి తిరిగె చెలిమితోడ 629

భార్య పరమసాధ్వి వామాక్షియందురు
ఇరువదేడు మంది వీరి సుతులు
ఇంట తిండిగింజ లేమియు లేకుండ
వెతలజెంద్రి బ్రహ్మరాతయేమొ 630

నాథ! ఎపుడొ వింటి నారాయణుడరయ
మీకు బాల్యమందు మిత్రుడంచు
అతని చెంతకరగి యాచించ కష్టముల్
తొలగజేయు, మనకు కలిమినిచ్చు 631

పయనమౌ కుచేలు వస్త్రపు చెంగున
కొంచెమటుకులామెయుంచికట్టె
వాటి చేతబట్టి ద్వారకాపురిని
చేరె ఆత్రమున కుచేలుడపుడు 632

లోనికరుగకుండ వాని నాపిరటున్న
కోట గుమ్మందు కొలుచువారు
దిక్కుతోచకతడు దేవ! శ్రీ కృష్ణాయ
ని మొరలిడగవచ్చె నేస్తగాడు! 633

అంతి పురములోకి అచ్యుతుడు కుచేలు
వెంటబెట్టుకొని వెడలగాను
రాణులందరటకు రయముగావచ్చి స్వా
గతము పలికిరమిత కౌతుకమున 634



నేస్తమా! కుశలమ? నిన్ను జూచి బహుకా
లంబు గడిచెను సుతులందరు, సతి
ఎటులున్నవారు? ఏమి తెచ్చితివయ్య
నాకు ఏది చూతునయ్య నేను 635

అనుచు కృష్ణుడతని అటుకులమూటను
విప్పిముందు తినెను పిడికెడు మరి
యింకనొక పిడికెడు యింపారతినె నంత
లో వలదని ఆపె రుక్మిణపుడు 636

రెండు పిడికెడులకు మెండుగా వైభవ
మిచ్చె హరి కుచేలు మేలు నెంచి
ఇంక తిన్న అతని ఇంటిలో దాస్యంబు
చేయవలెను గాన చెలియ ఆపె 637

వాసుదేవునిదయ వాత్సల్యమును గాంచి
డెందమున కుచేలుడెంతొ మురిసె
అతని వీడ్కొని చనెనటతనయింటికి
బదులు గాంచె దివ్య భవనమొకటి 638

లోనకేగియచట గాంచెను బంగారు
వస్తువులను పట్టు వస్త్రములు మరియు
దాస దాసి జనము తమకుసేవలొనర్ప
భార్య, సుతులు మురియ బ్రాహ్మణుండు 639

ఇచ్చిన అటుకులకు మెచ్చి శ్రీకృష్ణుడు
తనకు యింత సంపద సమకూర్చె
మైత్రికెంతొ విలువ మరువక మాధవు
డిచ్చెననికుచేలు డెంతొ మురిసె 640

×××

నృగుడు, బహుసుగుణుడు, నృపతి, ఇక్ష్వాకువం
శజుడు, దానశీలి సౌమ్యమూర్తి
ఎన్నొ గోవులను మరెన్నొ భూముల రత్న
ముల, హిరణ్యదానములను చేసె 641

గోవునొకటి యిచ్చె కూర్మి కశ్యపునకు
అదియు తిరిగి వచ్చి మందలోన
కలసిపోయె, గాని కానక మహరాజు
దాని నింకొకరికి దానమిచ్చె 642

కశ్యపుండు గోవు గానక వెతుకగా
విప్రునొకని వెంట వెడలు చుండ
గాంచి, గోవు తనదియంచడ్డగించెను
తగవు ముదిరి నృగుని దరికిజనిరి 643

తాను చేసినట్టి తప్పెరిగి నృగుడు
దానికి బదులుగాను వేనవేలు
అవులిచ్చెదనని అన కశ్యపుడు తన
గోవు మరల తనకు కావలెననె 644

పొరపడితిని నేను భూసురుడా! గోవు
నిమ్ము కశ్యపునికి నీకు ఎన్ని
కావలసిన అన్ని గోవులనిచ్చెద
ననగ అతను వదలనంచు పలికె 645

ఈవిధముగ విప్రు లిద్దరు రోషాన
వెడలిపోవ, నృగుడు వెగడు పడెను
కాలధర్మమొంది కాలుని పంపున
జనన మొందె భువిని వనము నందు 646

యుండె నొక్క నూతి యూసరివెల్లియై
యదుకుమారులుగని అక్కజమున
కృష్ణునికి తెలుపగ కేశవుడటకేగి
పట్టుకొనెను, దానిపైకి తీసె 647

తొల్లిరూపునొందె తొండ నృగునిగాను
పద్మనాభుని పద పద్మములకు
మ్రొక్కె భక్తితోడ, మోక్షము సిద్ధించ
దివిజలోకమేగె తేజమలర 648

×××

శౌరివోలె శంఖ చక్రములు ధరించి
వరలు చుండె రాజు పౌండ్రకుండు
వాసుదేవుడనుచు, యీసు చెందెను హరి
గూర్చి వినగ మిగులకోపమందె 649

పంపెదూతనొకని పౌండ్రిక వాసుదే
వుడు, కురూశపురి విభుడిటు తెల్పె
వసుధపైన నేనె వాసుదేవుడ, నన్ను
అనుకరింతువేల అఘము కాదె? 650

వచ్చి నాకు శరణు జొచ్చిన క్రమియింతు
అట్లుగాదటన్న అణతునిన్ను
యుద్ధ భూమిలోన, సిద్ధమై యుండుము
అనుచు దూత తెలిపె అచ్యుతునకు 651

కృష్ణుడు విని, పలికె కృత్రిమ రూపుడు
పౌండ్రకుండు, పరమ పాతకుండు
పోయి తెలుపుమతని పొగరును మాపగ
యముని సదనమునకు అంపువాడ 652

కాశిపురి విభునితొ కలసి పౌండ్రకుడు కా
శీ సమీపమందు సిద్ధమయ్యె
రెండు వైపులందు మెండుగా రోషంబు
ప్రజ్వరిల్లె ఘోర రణమునందు 653

కృష్ణుడతనిలోని కృపణత్వమును గాంచె
రధము విరుగగొట్టె లాఘవముగ
అతనిసారధితల అవలీల ఖండించె
చక్రమేసి పౌండ్రు శిరము కూల్చె 654

బాణమేయ కాశి పాలకుడసువుల
బాసె, అతని శిరము పట్టణమున
పడు విధముగ గొట్టె బాణఘాతంబున
భయము నొందిరచటి పౌరులెల్ల 655

కాశిరాజు సుతుడు కడరోషమును జెంది
వాసుదేవునియెడ యీసుబొంది
హోమమొకటి చేయ హోమ కుండము నుండి
ఉద్భవించి శక్తియుక్త కృత్య 656

ద్వారకానగరికి వచ్చి కృత్య హరిని
సంహరించగాను సాహసించె
శౌరికృత్యపైకి చక్రాయుధము నంప
భయముతోడ తాను బరుగుపెట్టె 657

కాశి జేరి కృత్య కాశిరాజు సుతుని
ఋత్విజులను చంపి సత్వమణిగె
విష్ణు చక్రమచట వెలసిన గృహములన్
మేడలను దహించి వెడలిపోయె 658

xxx

అష్టభార్యలు, పదహారువేల సతులు
ఇంతమందితోడ ఎట్లు శౌరి
మెలగుచుండెననుచు కలిగె సందేహము
నారదముని దాని నరయగోరి 659

ద్వారక నగరాన నారదముని, కోట
నంత తిరిగి తిరిగి వింత నొందె
ఎటకుబోయి చూడ అట వాసుదేవుడు
సరసమాడుచుండె సతిని గూడి 660

వక్కచోట నతడు వయ్యారిభామతో
ముచ్చటించుచుండె మురియుచుండె
ఇంకొకదరి మరొక యింతి పాటలు పాడ
తన్మయత్వమొంది తాండవించె 661

ఇట్లు నారదుండు ఎందెందు చూచిన
అందు కృష్ణుడమిత హావ భావ
చేష్టల అలరించె చేడియల నమిత
ప్రేమతోడ వారు ప్రీతినొంద 662

అతడనంతుడతడు ఆనందరూపుడు
జగతి ప్రేమమూర్తి సర్వులకును
భక్తజనులహృదినివాసుడు, వెయ్యేల!
ప్రకృతి అణువణువున బరగువాడు 663

సశేషం

ANNEXURE & ADVERTISEMENT

వైఖానస

యూత్ ఫోరమ్ న్యూస్

వైఖానస యూత్ ఫోరం, ఆంధ్రప్రదేశ్, విజయవాడ Regd. No. 25/93 వారిచే విడుదల చేయబడుచున్న త్రైమాసిక న్యూస్ బులిటెన్

ద్వితీయ సంచిక — జనవరి, ఫిబ్రవరి, మార్చి 1998

అంశములు

తెనాలి సభలో సినీతార
జంగారెడ్డిగూడెం శాఖ ఆవిర్భావం
భాగ్యనగర్ శాఖ - వార్తలు
ఖమ్మంశాఖ ప్రారంభం
అనూహ్యస్పందన
హుషారైన హుజూర్‌నగర్ కార్యకర్తలు
భక్త సమితులు
ఆగిరిపల్లిలో వన సమారాధన
విద్యార్థులకు బహుమతి ప్రదానం
సామూహిక ఉపనయనములు
శ్రీలక్ష్మీ జయంతి
అర్చక పరీక్షలు
నైమిశారణ్య యాత్ర
చిరునామా తెలుపండి
విన్నపాలు, విజ్ఞప్తులు
అభినందనలు
ఆహ్వానము

ఆశల పల్లకి

అక్షర సుమాంజలితో తొలిసంచికగా వెలువడిన ఈ త్రైమాసిక పత్రిక (న్యూస్ బులిటెన్) మరిన్ని సోయగాలు సంతరించుకొని, నూతన సంవత్సర శుభాకాంక్షలందిస్తూ, యూత్ ఫోరం పంచమ వార్షికోత్సవపు ఆహ్వానంతో ద్వితీయ కుసుమంగా మీ సన్నిధి చేరింది. ఆదరించి ఆశీస్సులందించండి.

ఈ క్రొత్త వత్సరంలో కొంగ్రొత్త యువకిషోరాలు మా చెంత చేరి వైఖానసుల సర్వతోముఖాభివృద్ధికై మేము చేయు కృషిలో భాగస్వాములై మన "వైఖానస యూత్ ఫోరమ్" ను ఒక ఎదురులేని, తిరుగులేని మహోజ్జ్వల, మహోన్నత సంఘటిత శక్తిగా రూపొందించి వైఖానస వైభవాన్ని దశదశలా ప్రభవింప చేయాలని, యువతని పట్టి పీడిస్తున్న నిరాశా నిస్పృహలను పారద్రోలాలని, ఆంధ్రదేశంలోని అర్చక కుటుంబీకులకు కష్టాలు కలిగిస్తున్న దుష్ట శక్తుల ప్రభావం నశింపచేయాలని ఆశిస్తూ, ఈ ఆశయాల సిద్ధికై అందరం, మనమందరం ఏకమై, మమేకమై ముందుకు రమ్మని పిలుస్తున్నదీ యూత్ ఫోరం ఆశల పల్లకి.

డా॥ దీవి శ్రీనివాస కృష్ణ — అధ్యక్షులు

అగ్నిహోత్రం చక్రధరాచార్యులు — ప్రధాన కార్యదర్శి

ఉత్తర ప్రత్యుత్తరములకు, సంప్రదించవలసిన చిరునామా : అగ్నిహోత్రం చక్రధరా చార్యులు, ప్రధాన కార్యదర్శి, వైఖానస యూత్ ఫోరం, డోర్ నెం. 1-4/6-18, కామకోటి నగర్, విజయవాడ -520 012, ఫోన్ : (0866) 411567

తెనాలి సభలో సినీతార

ది. 1-11-97వ తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు తెనాలి, నాజర్‌పేటలోని లక్ష్మీప్రసాద్ కళ్యాణమండపం నందు వైఖానస యూత్‌ఫోరం, తెనాలి శాఖవారిచే ఆరు మాసములుగా నిర్వహింపబడిన అర్చక పరీక్షల శిక్షణా తరగతుల ముగింపు సభ మరియు వైఖానస యూత్ ఫోరం న్యూస్ ప్రథమ సంచిక ఆవిష్కరణ సభ వైభవంగా జరిగినవి. యూత్‌ఫోరం, తెనాలి శాఖాధ్యక్షులు శ్రీమాన్ డా॥ నారాయణం వేణుగోపాల్ అధ్యక్షత వహించిన ఈ సభకు ముఖ్య అతిథిగా ప్రముఖ సినీనటి, పార్లమెంట్ సభ్యురాలు, ఊర్వశి శారద విచ్చేసి, వైఖానస యూత్‌పోరం న్యూస్ (త్రైమాసిక పత్రిక) ప్రథమ సంచికను ఆవిష్కరించారు. ఎంతో అంకిత భావంతో పనిచేస్తున్న యూత్‌ఫోరం సభ్యులను అభినందిస్తూ, సమాజ సేవలో తన వంతు సేవలందించడానికి సర్వదా సంసిద్ధురాలనని స్పష్టం చేశారు.

శ్రీమాన్ వేదాంతం విష్ణు భట్టాచార్యులు వారిచే తెనిగించబడిన శ్రీ వైఖానస కల్ప సూత్రం (ధర్మసూత్ర) గ్రంథాన్ని అష్టావధాన చక్రవర్తి, శతావధాన సార్వభౌమ, టి.టి.డి. వారి అన్నమాచార్య ప్రాజెక్ట్ డైరక్టర్ డా॥ మేడసాని మోహన్ గారు ఆవిష్కరించి గ్రంథ రచయితను బహుదా ప్రశంసించారు.

అర్చక పరీక్షల శిక్షణాతరగతులు నిర్వహించిన ఆచార్య దేవులను, సహకరించిన శాఖీయ ప్రముఖులను ఘనంగా సన్మానించారు. సన్మానితులు : శ్రీమాన్ డా॥ వేదాంతం విష్ణు భట్టాచార్యులు (తిరుపతి), శ్రీమాన్ దీవి హనుమంతా చార్యులు మరియు శ్రీమాన్ దీవి విఖానసాచార్యులు (కొలకలూరు), శ్రీమాన్ రొంపిచెర్ల శ్రీనివాసా చార్యులు (పాత రెడ్డిపాలెం), శ్రీమాన్ వేదాంతం శేషాచార్యులు (విజయవాడ), శ్రీమాన్ నారాయణం శ్రీనివాసాచార్యులు (తెనాలి), శ్రీమాన్ అర్చకం రామస్వామి దీక్షితులు (తిరుపతి)

ఉపన్యసించిన ప్రముఖులు : సర్వశ్రీమాన్, రాష్ట్ర యూత్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస కృష్ణ, చక్రధరాచార్యులు, తెనాలి శాఖ కార్యదర్శి డా॥ అగ్నిహోత్రం ధన్వంతరి; ఉపాధ్యక్షులు మేడూరి శ్రీనివాసమూర్తి, ప్రముఖ ఆగమ పండిట్ V.L.N.D. భట్టాచార్యులు (వైకుంఠపురం).

కొసమెరుపుగా వైఖానస యూత్ సభ్యుల కోరిక మేరకు అర్చక కాంగ్రెస్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీమాన్ తమిరిశ రామాచార్యులు మరియు అర్చక సేవా సమితి అధ్యక్షులైన శ్రీమాన్ దీవి కోదండరామ శర్మగారు సభికుల హర్షధ్వానాల మధ్య ఒకరినొకరు సన్మానించుకోవడంతో శోభిల్లిన ఈ సభ తెనాలి శాఖ ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీమాన్ అళహరి రవికుమార్ వందన సమర్పణతో ముగిసింది.

వార్తాసేకరణ : **నారాయణం రంగనాథాచార్యులు**, ఉల్లిపాలెం

జంగారెడ్డి గూడెం శాఖ ఆవిర్భావం

ది. 9-11-97న పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం పరిసరపు పది మండలాలలోని వైఖానస యువతీ యువకుల అభ్యున్నతికి వైఖానస యూత్ ఫోరం శాఖ వెలసినది. స్థానిక శ్రీవేణుగోపాలస్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఉదయం అర్చక పరీక్షాభ్యర్థులకు శిక్షణా తరగతులు, మధ్యాహ్నం కార్తీక వనసమారాధన అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగినవి. శ్రీ గంగానమ్మ దేవస్థాన అర్చకులు శ్రీమాన్ వాడపల్లి సీతారామాచార్యులు స్థానిక యువకులతో కలసి ఎంతో శ్రమించి ఏర్పాటు చేయబడిన ఈ కార్యక్రమాలు పలువురి ప్రశంసలు అందుకున్నవి. శ్రీమాన్ వేదాంతం శేషాచార్యులు (విజయవాడ) వారు శిక్షణా తరగతులు నిర్వహించారు.

సాయంకాలం ఏర్పాటుచేసిన సమావేశమునకు ముఖ్య అతిథిగా విచ్చేసిన వైఖానస పత్రిక ఉప సంపాదకులు శ్రీమాన్ డా॥ వేదాంతం రామకృష్ణమాచార్యులు గారు యూత్ ఫోరమ్, జంగారెడ్డి గూడెం శాఖను ప్రారంభించారు. రాష్ట్ర యూత్ ఫోరమ్ సహాయ కార్యదర్శి శ్రీమాన్ చక్రవర్తుల సుబ్బారావుగారి సమక్షంలో అడహాక్ కమిటీ నియామకం జరిగింది.

కీర్తిశేషులు శ్రీమాన్ కొండూరి సీతారంగాచార్యుల-వరలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు శ్రీమాన్ లక్ష్మణాచార్యులు గారు పేద విద్యార్థులకు ఇచ్చిన సహాయాన్ని ఈ సభలో అందచేసారు. అడహాక్ కమిటీ సభ్యులు, **అధ్యక్షులు** సర్వశ్రీమాన్ చక్రవర్తుల సీతారామానుజా చార్యులు, జంగారెడ్డిగూడెం, **ఉపాధ్యక్షులు** 1) వాడపల్లి భాస్కర రత్నమా చార్యులు (జంగారెడ్డిగూడెం), 2) సి.హెచ్. శ్రీనివాస చక్రవర్తి (అన్నదేవర పేట); **ప్రధాన కార్యదర్శి** : వాడపల్లి సీతారామాచార్యులు (జంగారెడ్డి గూడెం); **సంయుక్త కార్యదర్శి** : మేడూరి వెంకట రమణాచార్యులు (జంగారెడ్డిగూడెం); **కార్యవర్గ సభ్యులు** : 1) మేడూరి పార్థసారధి 2) వాడపల్లి శేషాచార్యులు 3) ఖండవిల్లి శ్రీనివాసా చార్యులు (రెడ్డి గణపవరం) 4) జి. సత్యనారాయణాచార్యులు 5) జి.వి.వి. సి.ఎస్. కుమార్ (ద్వారకా తిరుమల) 6) వాడపల్లి లక్ష్మణాచార్యులు (జంగారెడ్డి గూడెం) 7) గుడిపూడి రామశేషాచార్యులు (కొయ్యల గూడెం) 8) అగ్నిహోత్రం సీతారామాంజనేయాచార్యులు (గోపాలపురం) ; **గౌరవ సలహాదారులు** : 1) రొంపిచెర్ల రామాచార్యులు (ఇంజనీరు, జంగారెడ్డి గూడెం) 2) ఏడిద రామానుజాచార్యులు (LIC– శ్రీనివాసపురం) 3) వేదాంతం వెంకటాచార్యులు, (మద్ది).

వార్తా సేకరణ, **వాడపల్లి వెంకటనారాయణాచార్యులు**, గవరవరం

మీకు దగ్గరలో గల వైఖానస యూత్ ఫోరం శాఖలో సభ్యులుగా చేయండి.
సంఘాన్ని పటిష్ఠ పరచండి.

వైఖానస యూత్‌ఫోరం (VYF) భాగ్యనగర్ శాఖ

వార్తలు - విశేషాలు

☞ ది. 8-11-97న హైదరాబాద్, BHEL దగ్గరగల చందానగర్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో అర్చక పరీక్షార్థులకు శిక్షణా తరగతులు జరిగినవి. ఈ శాఖ చీఫ్ ఎడ్వయిజర్ శ్రీమాన్ అగ్నిహోత్రం నరసింహాచార్యులు గారు జ్యోతిని వెలిగించి తరగతులు ప్రారంభించగా, వైఖానసాగమ సుధానిధి శ్రీమాన్ ఖండవిల్లి హనుమచ్ఛేషా చార్యులు (కాకినాడ) వారు నిర్వహించారు. శ్రీమాన్ కె. అనంత పద్మనాభాచార్యులు (రాజమండ్రి) వారు స్టడీ మెటీరియల్ సమకూర్చినారు.

☞ ది. 9-11-97న ఇదే ఆలయంలో ఈ శాఖ ఆధ్వర్యంలో సుమారు 300 మంది వైఖానసులు మరియు 500 మంది భక్తజనులచే సమిష్టిగా శ్రీ పద్మావతీ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి అత్యంత విశేషంగా లక్ష్మీ తులసి పూజ, తదనంతరం వన సమారాధన జరిగినవి. ఆలయ ప్రధానార్చకులు, శ్రీమాన్ సుదర్శనం సత్యసాయి గారి సత్సంకల్పం, విశేష కృషి ఈ విజయానికి మూలకారణం కాగా, వైఖానసాగమ పండితులు శ్రీమాన్ కె. హనుమచ్ఛేషాచార్యులు (కాకినాడ), శ్రీమాన్ పి. కృష్ణమాచార్యులు (నర్సాపురం) కన్నుల పండుగగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్వశ్రీమాన్ ఎ. నర్సింహాచార్యులు (ఛైర్మన్), పి. చలమాచార్యులు (కన్వీనర్)లుగాను, M.R. ప్రసాద్, డి. హనుమంతరావు, S. సత్యసాయి, R. భరతాచార్యులు, అళహరి శింగరాచార్యులు, A.J. మోహన్, P.S. రమేష్, ఎ. లక్ష్మణా చార్యులు సభ్యులుగా ఏర్పడిన సారథ్య సంఘం మరియు అప్పు అప్పడాల కంపెని యాజమాన్యం, దేవస్థాం కమిటీ ఛైర్మన్ శ్రీ రామచంద్ర రాజు, సభ్యులు శ్రీ సత్యరెడ్డి, శ్రీ ప్రకాష్ రెడ్డి తదితరుల సహకారంతో ఈ మహోత్సవం మనోహరంగా సాగింది.

☞ ది. 21-12-97 సాయంత్రం హైదరాబాద్, A.S.Rao నగర్ నందు శ్రీమాన్ ఖండవిల్లి కృష్ణమాచార్యులు వారి గృహమునందు ఈ శాఖ కార్యవర్గ సమావేశం జరిగినది. ఇందు ఆమోదించబడిన వాటిలో ముఖ్య తీర్మాన సారాంశం : ఉపయుక్తమైన విషయాలతో వెలువరిస్తున్న "వైఖానస పత్రిక" యొక్క యాజమాన్యం మరియు సంపాదక వర్గ సభ్యుల కృషిని ప్రశంసిస్తూ, డిశంబర్ 97 సంచికలో సంపాదకీయం ద్వారా ఎడిటర్ శ్రీమాన్ D.V. చారి గారు వెలువరించిన ఆవేదనని అర్థం చేసుకుని పత్రికకు మరింత చేయూత నిచ్చు ఉద్దేశ్యంతో 1998 సం॥రంలో పత్రికకు సుమారు 100 క్రొత్త చందాదారులను ఈ శాఖ ద్వారా చేర్పించి సహకరించుటకు సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించినారు.

☞ భరతమాత ముద్దుబిడ్డ అయిన శ్రీస్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ది. 11-1-98న మధ్యాహ్నం, ఈ శాఖ 'యూత్ పార్లమెంట్'' అనే వినూత్న కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటి కాలేజ్ కాంపస్ నందు నిర్వహించినది. వైఖానస విద్యార్థులు అనేకమంది ఇందులో పాల్గొని తమకు నచ్చిన లేక తెలిసిన విషయం మీద ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా శ్రీమాన్ పెద్దింటి శేషాచార్యులు (ప్రెసిడెంట్ - VYF, Hyd) శ్రీమాన్ కె. రాంమాధవ్ (Associate Editor – Jagruti) గారలు, ముఖ్య అతిథిగా Dr. V. రామకృష్ణమాచార్యులు (వైఖానస పత్రిక ఉప సంపాదకులు, విజయవాడ), ప్రత్యేక ఆహ్వానితులుగా Dr. R.S. దీక్షితులు, శ్రీమాన్ ఎ. చక్రధరా చార్యులు (ప్రధాన కార్యదర్శి, VYF, విజయవాడ), కోఆర్డినేటర్‌గా కుమారి ఎ. గీతాకుమరి, న్యాయవాది; కన్వీనర్‌గా శ్రీమాన్ కె. జనార్ధనా చార్యులు కాగా సభ్యులుగా శ్రీ దీవి రఘునాథ దీక్షితులు, శ్రీ యస్. సత్యనారాయణా చార్యులు, శ్రీ అంగర సాయి, శ్రీ ముత్తేవి లక్ష్మీనరసింహ భట్టర్, శ్రీ అగ్నిహోత్రం దాశరధి, శ్రీ ఏడిద ఉదయకుమార్, శ్రీ అగ్నిహోత్రం శ్రీకాంత్, శ్రీ పెద్దింటి వీర రాఘవాచార్యులు, శ్రీ ఆర్.బి. పార్థసారథి, శ్రీమతి గోవర్ధనం రమాదుర్గాదేవి, కుమారి పెదపూడి శైలజ, కుమారి సుదర్శనం పద్మజ ఉండి విజయవంతం చేశారు.

☞ VYF ఆడిటర్ శ్రీమాన్ మాల్యవంతం శ్రీనివాస్ గారికి, వైఖానసులలో మొట్టమొదటి మహిళా సబ్-ఇన్‌స్పెక్టర్ అయిన కుమారి అగ్నిహోత్రం మాధవీలత గారలకు వైఖానస యువ పురస్కారం అందచేశారు.

వార్తా సేకరణ, **పెద్దింటి రఘు** (M.D.) ఆయుర్వేద

చిరునామా తెలుపండి !

ఈ క్రింది వైఖానస సోదరులు యూత్‌ఫోరం జీవిత సభ్యత్వం చెల్లించి యున్నారు. శ్రీమాన్ వి. రామాచార్యులు (రశీదు నెం. 72, తేది. 1.8.1992), శ్రీమాన్ బిక్కవోలు రామసాయిప్రసాద్ (రశీదు నెం. 83, తేది 12-8-92) కాని, వీరి పూర్తి చిరునామాలు మా రికార్డులలో లేనందున వారు తమ రశీదును ఫోటోస్టాట్ కాపీ తీయించి దాని వెనుక పూర్తి చిరునామా వ్రాసి, ప్రధాన కార్యదర్శి కార్యాలయమునకు పంప ప్రార్థన.

అదే విధంగా ఎవరైనా తాము జీవిత సభ్యులై రసీదు పొందివుండి మానుంచి ఎటువంటి సమాచారం అందని యెడల వారు కూడా ఇదే విధంగా చేయండి.

ఖమ్మం శాఖ ప్రారంభం

ది. 27-7-97న ఖమ్మంలోని పోలీస్ స్టేషన్ వద్దగల రామాలయం నందు అర్చక పరీక్షల శిక్షణా తరగతి మరియు వైఖానస యూత్ ఫోరం, ఖమ్మం శాఖ ప్రారంభోత్సవ సభ జరిగినది. శ్రీమాన్ నరహరి నరసింహాచార్యులు ఆతిధ్యం మరియు ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు విజయవాడ నుండి ప్రధాన కార్యదర్శి శ్రీమాన్ ఎ. చక్రధరాచార్యులు మరియు వైఖానస పండిట్ శ్రీమాన్ వేదాంతం శేషాచార్యులు హాజరయి శాఖను ప్రారంభించినారు. ఈ శాఖ అడహక్ కమిటీ సభ్యుల వివరాలు : **అధ్యక్షులు** : శ్రీమాన్ వేదాంతం సత్యనారాయణాచార్యులు (ఖమ్మం), **ఉపాధ్యక్షులు** : శ్రీమాన్ గుంటూరు పద్మనాభం (అమ్మపేట), శ్రీమాన్ పరాంకుశం శ్రీనివాసా చార్యులు (వేంసూరు), **కార్యదర్శి** : శ్రీమాన్ నరహరి నరసింహాచార్యులు (ఖమ్మం), **సహాయ కార్యదర్శులు** : శ్రీమాన్ నారాయణం విజయకుమార్ మరియు శ్రీమాన్ పరాంకుశం గోవర్ధనాచార్యులు (ఖమ్మం), **సభ్యులు** : సర్వశ్రీ పరాంకుశం ప్రసాద్, తిరునగరి యాదగిరి ఆచార్యులు, నరహరి శేతుమా ధవాచార్యులు, నరహరి రామకృష్ణ (ఖమ్మం), నరగిరి నాధుని శ్రీనివాస దీక్షితులు (మామునూరు).

వార్తసేకరణ : **డా॥ నరగిరి నాధుని కృష్ణమాచార్యులు**, మాటూరు.

అభినందనలు

వైఖానస యూత్ ఫోరం స్థాపక సభ్యులలో ఒకరైన డా॥ పెద్దింటి రఘుగారు హైదరాబాద్‌లోని శ్రీ బూర్గుల రామకృష్ణారావు ఆయుర్వేద కళాశాల యందు *M.D.* కోర్సు చేసి, డిగ్రీని మరియు అత్యుత్తమ ప్రతిభకు గుర్తింపుగా ప్రశంసా పత్రాన్ని సాధించారు. ది. 5-2-98న విజయవాడలో యూనివర్శిటి ఆఫ్ హెల్త్ సైన్సెస్ వారి స్నాతకోత్సవములో రాష్ట్ర గవర్నర్ మాన్యశ్రీ చక్రవర్తి రంగరాజన్ గారు పట్టాను,ప్రశంసా పత్రాన్ని డా॥ రఘు గారికి అందచేసారు. ఈ ఆనందపు శుభవేళ, వైఖానస యూత్ ఫోరం, డా॥ రఘు గారికి హృదయపూర్వక అభినందన చందనాలు తెలుపుతున్నది. వైద్యపరంగా, సమాజసేవ పరంగా వారు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాము.

అనూహ్య స్పందన

ది. 26-10-97న పశ్చిమగోదావరి జిల్లా, భీమవరంలోని శ్రీ పద్మావతి వేంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగంణంలో వైఖానసాగమ అర్చక పరీక్షల శిక్షణా తరగతులు జరిగినవి. శ్రీ వైఖానసాభ్యుదయ పరిషత్ యూత్; శృంగవృక్షం వారి సంపూర్ణ సహకారంతో నిర్వహింపబడిన ఈ క్లాసులకు విశేష సంఖ్యలో వైఖానస అభ్యర్థులు హాజరయి లబ్ధిపొందినారు. అభ్యుదయ పరిషత్ యూత్ గౌరవాధ్యక్షులు శ్రీమాన్ పెద్దింటి రాజగోపాల దీక్షితులు, కార్యదర్శి శ్రీమాన్ పెద్దింటి కేశవాచార్యులు (నర్సాపురం) వారు ఈ విజయానికి ముఖ్య కారకులు. జువ్వలపాలెం రోడ్‌లోని శ్రీ అయ్యప్ప దీక్షా మందిరం ప్రధాన అర్చకులు, యూత్ ఫోరమ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీమాన్ ఖండవిల్లి కేశవాచార్యులు దంపతులు ఎంతో శ్రమకోర్చి స్వయం ఖర్చుతో, వచ్చిన సుమారు 200 మంది శాఖీయులకు భోజన సదుపాయాలు ఏర్పాటు చేసినారు. ప్రముఖ వైఖానసాగమ పండితులు శ్రీమాన్ ఎస్. శేషాచార్యులు (చానమిల్లి), శ్రీమాన్ వి. జానకి రామాచార్యులు (పాలమూరు), శ్రీమాన్ వి. శేషాచార్యులు (విజయవాడ) వారలు శిక్షణా తరగతులు నిర్వహించారు. యూత్ ఫోరం ఉపాధ్యక్షులు శ్రీమాన్ దీవి జ్వాలానంద్ (వణుకూరు), సంయుక్త కార్యదర్శి : శ్రీమాన్ చక్రవర్తుల సుబ్బారావు (విజయవాడ), తదితర స్థానిక నాయకులు, యువకులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయుటలో కృషి చేసినారు.

వార్తా సేకరణ : **శ్రీనివాసుల శ్రీనివాస్**, *అగ్రహార గోపవరం*

హుషారైన హుజూర్ నగర్ కార్యకర్తలు

ది. 19-10-97న నల్గొండ జిల్లా హుజూర్ నగర్‌లో అర్చక పరీక్షల శిక్షణా తరగతులు జరిగినవి. హాజరయిన అభ్యర్థులలో ఎక్కువమంది యూత్‌ఫోరం సభ్యులుగా చేరి, త్వరలో హుజూర్ నగర్ మరియు నల్గొండ యూత్ ఫోరం శాఖ ఏర్పాటు చేయగలమని తెలియచేసినారు. శ్రీమాన్ వి. శేషాచార్యులు (విజయవాడ) వారు తరగతులు నిర్వహించినారు. శ్రీమాన్ నరగిరి నాధుని రాఘవాచార్యులు వారి కుమారుడు చిరంజీవి నరసింహచార్యులు ఆతిథ్యం ఇచ్చినారు. రాష్ట్ర యూత్ ఫోరం ప్రధాన కార్యదర్శి చక్రధరా చార్యులు గారి నిర్వహణలో శ్రీమాన్ డా॥ బి.వి. కృష్ణమాచార్యులు (హుజూర్ నగర్) వారి ప్రోత్సాహంతో ఈ కార్యక్రమం దిగ్విజయంగా జరిగినది.

వార్తా సేకరణ, **సి.హెచ్. పద్మనాభమూర్తి**, ప్రధాన అర్చకులు, మట్టపల్లి క్షేత్రం

భక్త సమితులు

ది. 13-12-97న గుంటూరు జిల్లా తాడేపల్లిలో రాష్ట్రయూత్ ఫోరం మరియు అర్చక సంఘాల నాయకులు, కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతి స్వామిజీని కలసి రాష్ట్రంలోని అర్చకుల సమస్యలు విన్నవించగా, వారు ప్రభుత్వాన్ని, ప్రజలని, అర్చకులను ఉద్దేశించి చేసిన అనుగ్రహ భాషణంలో అనేక విషయాలు సూచించారు.

ముఖ్యంగా ప్రతి గ్రామంలోనూ ఆయా ఆలయాలలోని దేవుడి పేరుమీద భక్తులంతా కలసి భక్త సమితులుగా ఏర్పడవలెనన్నారు. ప్రభుత్వ సహాయం అర్థించకుండా ఆయా ఆలయాలలో నిత్యనైమిత్తక పూజలు ఈ సమితుల నిర్వహణలో బాగా జరిపిస్తే, ధార్మిక కార్యక్రమాల నిర్వహణలో ప్రభుత్వాన్ని జోక్యం చేసుకోవలదని అడిగేందుకు హిందూ సమాజానికి వీలౌతుంది అని స్వామిజీ ప్రవచించారు. అర్చకుడిని సర్కారి నౌకరుగా పరిగణిస్తే ఆయా దేవతలకు ప్రకోపం వస్తుందని, ఇది దేశానికి క్షోభకరమని వారు హెచ్చరించారు. ఇంకా అనేక విషయాలపై వివరణ ఇచ్చిన వీరి అనుగ్రహ భాషణాన్ని రాష్ట్రంలోని ప్రముఖ తెలుగు దినపత్రికలన్ని తగు ప్రాధాన్యత నిచ్చి ప్రచురించినాయి. వారందరికి యూత్‌ఫోరం ధన్యవాదాలు తెలియచేస్తున్నది.

ఆగిరిపల్లిలో వనసమారాధన

ది. 23-11-97న కృష్ణాజిల్లా ఆగిరిపల్లిలో యూత్ ఫోరమ్ వారిచే వన సమారాధన జరిగినది. శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి వారికి విశేష పూజ జరిపిన అనంతరం ఆహ్లాదకరమైన వాతావరణంలో అత్యంత ఉత్సాహంగా కృష్ణాజిల్లా యూత్‌ఫోరం వారు నిర్వహించిన ఈ సమారాధనలో ఇతర జిల్లాలు వారు కూడా పాల్గొనడం విశేషం. స్థానిక వైఖానస కుటుంబీకులు, విజయవాడ మరియు నూజీవీడు ప్రాంతపు యూత్‌ఫోరం సభ్యులు అందించిన సహాయ సహకారాలతో ఈ కార్యక్రమం విజయవంతం అయినది. అందరికి మా ధన్యవాదాలు.

విద్యార్థులకు బహుమతి ప్రదానం

ఈ సంస్థ పంచమ వార్షికోత్సవ వేడుకలో ఈ క్రింద సూచించిన కోర్సులనందు ఆయా బోర్డ్ / యూనివర్సిటీ వారు క్రిందటి విద్యాసంవత్సరం (1997 మార్చి) చివర నిర్వహించిన ఫైనల్ పరీక్షల యందు అత్యధిక మార్కులు సాధించిన వైఖానస యువతీ యువకులకు బహుతులు అందచేయబడతాయి. 7th, S.S.C., Sr. Inter, B.A., B.Com., B.Sc., B.Tech. (B.E.), M.B.B.S., B.A.M.S., M.A., M.Com., M.Sc., M.D., M.S., M. Tech.,

ప్రధమశ్రేణి, ఆపై మార్కులు సాధించిన వారు మాత్రమే తమ మార్కుల మెమోల జిరాక్స్ ప్రతులను Attestation చేయించి 20-2-98లోగా ప్రధాన కార్యదర్శి చిరునామాకు పంపప్రార్థన.

వైఖానసులలోని వితరణ శీలురు కొందరు క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం బహుమతి విజేతలకు మెడల్స్ ఇచ్చుచున్నారు. ఇంకను మరికొందరికి అవకాశం కలదు. ఒక్కొక్క మెడల్ ఇచ్చుటకు పదిహేను గ్రాముల వెండి మరియు తయారీ ఖర్చు కలిసి ఈ రోజు ధరల ననుసరించి రు. 200/- అగును. కనుక ఆసక్తిగల వారు తగు సొమ్మును, ఎవరి పేరుమీదుగా ఇచ్చుచున్న వివరము ది. 20-2-98లోగా ప్రధాన కార్యదర్శి గారికి పంపవలెను. పంచమ వార్షికోత్సవ వేదికపై బహుమతి విజేతలకు వితరణదారులచే బహుమతి ప్రదానం చేయించబడును.

సామూహిక ఉపనయనములు

యూత్‌ఫోరం వారు ప్రతి సంవత్సరం చేయుచున్న ఈ కార్యక్రమం వైఖానస శాఖీయులకు ఎంతో ఉపయుక్తంగా ఉండి, విశేషమైన ఆదరణకు నోచుకున్నది. ఈ సంవత్సరం ది. 7-5-98న ఈ "సామూహిక ఉపనయనములు" చేయుటకు పెద్దల మరియు దైవజ్ఞుల అనుమతి అయినది. తెనాలి లేదా ఏలూరులలో చేయవలెనని సంకల్పం. కాని, వటువులు ఎక్కువగా ఏ ప్రాంతం నుండి వచ్చినారో పరిశీలించి అందరికి అనువైన చోట వీటిని జరిపించగలము. కనుక, ఈ సంస్థ ద్వారా మీ చిరంజీవులకు ఉపనయనం చేయించదలచుకున్న తల్లిదండ్రులు ప్రధాన కార్యదర్శిగారి చిరునామాకు సంప్రదించవలెను.

శ్రీ లక్ష్మీ జయంతి

శ్రీ లక్ష్మీ జయంతి నిర్వాహక కమిటీ, విజయవాడ వారు రాష్ట్ర వైఖానస యూత్ ఫోరం వారి సహాయ సహకారాలతో గత రెండు సంవత్సరాలుగా లక్ష్మీ జయంతి జరుపుచున్నారు. ఈ సంవత్సరం క్రొత్తగా 15 అంగుళాల పంచలోహపు "శ్రీ రాజ్యలక్ష్మీ అమ్మవారిని" చేయించి ది. 1-2-98న ఉదయం గం. 11-56 ని॥లకు ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం జరిపించారు. శ్రీమాన్ అగ్నిహోత్రం వెంకటాచార్యులు గారి ఆధ్వర్యంలో వైఖానస శాస్త్రోక్తంగా సాగిన ఈ కార్యక్రమములో డా॥ వేదాంతం రామకృష్ణమాచార్యులు - శ్రీమతి భానువాణి దంపతులు పాల్గొన్నారు. ది. 13-3-98 శుక్రవారం నాటి లక్ష్మీ జయంతిని విజయవాడ వన్‌టౌన్, బ్రాహ్మణ వీధిలోగల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంనందు త్రయాహ్నిక దీక్షతో అనగా మార్చి 13, 14, 15 తేదీలలో జరుపుటకు నిర్ణయించినారు. భక్తజన ఆత్మబంధువులైన అర్చక సోదరు లెల్లరూ ఈ కార్యక్రమం విజయానికి తమ చేయూత నందించవలసినదిగా కోరుచున్నాము.

వివరాలకు యూత్‌ఫోరం ప్రధాన కార్యదర్శి చిరునామాకు సంప్రదించవలెను.

వార్తాసేకరణ : **డా॥ దీవి జ్వాలానంద్**, వణకూరు.

అర్చక పరీక్షలు

జనవరి 17, 18 తేదీలలో దేవాదాయ ధర్మాదాయ శాఖవారు నిర్వహించిన అర్చక పరీక్షలు వివిధ కేంద్రాలలో ప్రశాంతంగా జరిగినట్లు వార్తలు వస్తున్నవి. డిపార్ట్‌మెంట్ వారికి స్థానిక అర్చక నాయకులు, సంస్థలు సంపూర్ణ సహకారాన్ని అందించి వారి ప్రశ్నపత్రములు అందుకున్నట్లు తెలిసినది. అయినప్పటికి హాల్ టికెట్స్ రాక కొందరు, సరియైన సమాచారం తెలియక కొందరు ఈ పరీక్షలు వ్రాయలేక పోయారు. ఈ పరీక్షా ఫలితాలు విడుదలకు రెండు మాసాల సమయం పట్టవచ్చు.

వైఖానస యూత్‌ఫోరం వారు నిర్వహించిన శిక్షణా తరగతులకు హాజరయి పరీక్షలు వ్రాసిన అభ్యర్థులు తమ హాల్ టికెట్ నెంబరు, వారు వ్రాసిన సెంటర్ పేరు, ఊరు మరియు వారికి యూత్‌ఫోరమ్ వారిచ్చిన సీరియల్ నెంబరు (ఇన్‌లాండ్‌తో మీకు పంపబడిన నెంబరు) మొదలైన వివరాలు వ్రాసిన పోస్టల్ రిప్లై కార్డు ప్రధాన కార్యదర్శి చిరునామాకు పంపప్రార్థన. భవిష్యత్‌లో వారితో సంప్రదింపులు జరుపుటకు మరి ఇతర ప్రయోజనాలకు తద్వారా వీలు కలుగుతుంది.

మీరు రు. 116/-లు చెల్లించి ఈ సంస్థలో జీవిత సభ్యులుగా చేరండి. సంఘటిత శక్తిగా రూపొంది అనేక ప్రయోజనాలు పొందండి.

నైమిశారణ్య యాత్ర

మన పురాణాలకు పుట్టిల్లు నైమిశారణ్యం. పరమోత్కృష్టమైన శ్రీ వైఖానస కల్ప సూత్రం ప్రభవించిన ఈ పుణ్యభూమి నైమిశాన్ని ప్రతి వైఖానసుడు దర్శించి తరించినపుడే జన్మ సార్థకత అవుతుంది. శ్రీ వైఖానస సమాజం, విజయవాడ వారి అవిరళ కృషి ఫలితంగా ఈ నైమిశారణ్యంలో శ్రీ విఖనసాచార్యులవారి, శ్రీ బాలాజీవారి ఆలయాలు నిర్మింపబడి, నిత్యారాధన జరుగుతున్నది. ఈ దివ్యక్షేత్రంలో ప్రతి సంవత్సరం మే నెల ఆఖరి వారంలో జరిగే వార్షిక ఆరాధనోత్సవములలో పాల్గొనుటకు వైఖానసులకు వీలు కలిగించుటకై నైమశారణ్య యాత్ర ఏర్పాటుకు వైఖానస యూత్‌ఫోరం సంకల్పించినది. వివరాలకై ప్రధాన కార్యదర్శి చిరునామాకు వ్రాయండి.

విన్నపం

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లి గూడం మరియు తణుకు కేంద్ర బిందువులుగా ఆయా పరిసర ప్రాంతాలలోని మండలాలలోగల వైఖానస యువతీ యువకుల అభ్యున్నతికి రెండు యూత్‌ఫోరం శాఖలు ఏర్పాటు చేయమని కొందరు శాఖీయులు కోరియున్నారు. అందు నిమిత్తం ఆసక్తిగల యువశక్తులు ఈ క్రింది చిరునామాకు సంప్రదించవలెను. చక్రవర్తుల సుబ్బారావు, N.S.M. పబ్లిక్ స్కూల్, పటమట. విజయవాడ - 520 010.

వైఖానస్ యూత్ ఫోరం, ఆంధ్రప్రదేశ్, ర.నెం. 25/93, విజయవాడ

పంచమ వార్షికోత్సవ ఆహ్వానము

ది. 1-3-98 ఆదివారము ఉదయం 8.00 గంటల నుండి చందావారి కళ్యాణమండపము-రాజమండ్రి నందు వైఖానస యూత్‌ఫోరం తూర్పు గోదావరి జిల్లా శాఖ వారి ఆధ్వర్యంలో జరుగు పంచమ వార్షికోత్సవమునకు తామెల్లరు సకుటుంబముగా విచ్చేసి కార్యక్రమములో పాల్గొని సంఘాభివృద్ధికి అమూల్యమైన తమ సలహా సూచనలందించ ఆహ్వానించుచున్నాము.

ఉదయం 8.00 గంటలకు : **విఖనస స్వామి వారి గ్రామోత్సవము.**

శ్రీమాన్ డా॥ పెదపూడి రామానుజహరి (డా॥ పి.ఆర్. హరి MBBS- కాకినాడ) వేదిక

సమయం	:	ఉదయం 9-00 గం॥ల నుండి 12-00 వరకు
పతాకావిష్కరణ	:	**శ్రీమాన్ డా॥ బృందావనం ధన్వంతరి** MBBS, బందరు
స్వాగతవచనాలు	:	**శ్రీమాన్ K.V.S.R.N. ఆచార్యులు,** రాజమండ్రి, ఆహ్వాన సంఘకార్యదర్శి
జ్యోతి ప్రజ్వలన	:	**శ్రీమాన్ వాడపల్లి అయ్యమాచార్యులు** (కాండ్రేగుల)
సభాధ్యక్షులు	:	**శ్రీమాన్ డా॥ పెద్దింటి సీతారామ భార్గవ** కోరుకొండ ఉపాధ్యక్షులు - S.V.D.S.V. సభ, తిరుమల, ఆహ్వాన సంఘ అధ్యక్షులు
ముఖ్య అతిథి	:	**శ్రీమాన్ అగ్నిహోత్రం రంగాచార్యులు,** వాణి ప్రెస్, విజయవాడ.
కార్యదర్శి నివేదిక	:	**శ్రీమాన్ అగ్నిహోత్రం చక్రధరాచార్యులు,** విజయవాడ, రాష్ట్రశాఖ ప్రధాన కార్యదర్శి **& శ్రీమాన్ చక్రవర్తుల సుబ్బారావు,** రాష్ట్ర శాఖ సంయుక్త కార్యదర్శి

ఉపన్యాసకులు : శ్రీమాన్ దీవి శ్రీనివాసకృష్ణ, రాష్ట్రశాఖ అధ్యక్షులు; శ్రీమాన్ ఖండవల్లి హనుమత్ శేషాచార్యులు, కాకినాడ, శ్రీమాన్ అగ్నిహోత్రం నరసింహాచార్యులు; హైదరాబాద్; శ్రీమాన్ డా॥ దీవి కోదండరామాచార్యులు LIM, వణుకూరు; శ్రీమాన్ బృందావనం కృష్ణమాచార్యులు, హుజూర్‌గనర్, శ్రీమాన్ పెద్దింటి రాంబాబు, వెలిచేరు; శ్రీమాన్ రంగనాధాచార్యులు, ఒంగోలు; సన్మానములు : శ్రీమాన్ అర్చకం రామచంద్ర దీక్షితులు, మెంబర్ ఆగమ బోర్డ్, మిరాశీదార్, టి.టి.డి. తిరుమల; శ్రీమాన్ పెద్దింటి లక్ష్మీనరసింహాచార్యులు, లూటుకుర్రు; శ్రీమాన్ కె.కె. ఆచార్యులు; తిరుపతి; శ్రీమాన్ పెద్దింటి అప్పలాచార్యులు, కుండలేశ్వరం; శ్రీమాన్ అంగర వెంకటాచార్యులు; పెనికేరు. శ్రీమాన్ ఎ. వెంకటాచార్యులు, చిరువోలు లంక

వీణాకోవిద, వీణావిశారధా, వీణాగాన విశారద శ్రీమాన్ ఖండవల్లి జనార్దనాచార్యులు, రాజమండ్రి వేదిక

సమయం	:	మధ్యాహ్నం 2 గం॥ల నుండి 4 గం॥లు వరకు
స్వాగత వచనాలు	:	శ్రీమాన్ ఖండవల్లి రాధాకృష్ణమాచార్యులు, దుళ్ళ
ముఖ్య అతిథి	:	శ్రీమాన్ దీవి శ్రీనివాస దీక్షితులు, తిరుమల
సభాధ్యక్షులు	:	శ్రీమాన్ వాడపల్లి శేషావతారం, కరకుదురు

ఉపన్యాసకులు : శ్రీమాన్ అగ్నిహోత్రం ధన్వంతరి, తెనాలి; శ్రీమాన్ పెద్దింటి వెంకట లక్ష్మీనరసింహాచార్యులు, కపిలేశ్వరపురం; శ్రీమాన్ పెద్దింటి వెంకట నారాయణాచార్యులు, లూటుకుర్రు; శ్రీమాన్ N.A.L.N. మూర్తి, మచిలీపట్నం, శ్రీమాన్ డా॥ ఉదయగిరి సీతారామాచార్యులు, ఒంగోలు; శ్రీమాన్ ఖండవల్లి కేశవాచార్యులు, భీమవరం; సన్మానములు : శ్రీమాన్ వేదాంతం శేషాచార్యులు,

ANNEXURE & ADVERTISEMENT

విజయవాడ: శ్రీమాన్ వాడపల్లి జానకీ రామానుజాచార్యులు: మాముడూరు: శ్రీమాన్ సుదర్శనం గోపాలాచార్యులు; తామరపల్లి: శ్రీమాన్ ఖండవల్లి అనంత పద్మనాభాచార్యులు; రాజమండ్రి: శ్రీమాన్ వేదాంతం పార్థసారథి, కాకినాడ.

జ్ఞాపిక : కీ॥శే॥ వాడపల్లి రంగనాథాచార్యులు గొల్లప్రోలు, వైఖానస ఆగమానికి చేసిన సేవల గురించి పెద్దింటి శేషాద్రి దీక్షితులు గారి పరిచయము జ్ఞాపిక బహూకరణ.

శ్రీమాన్ డా॥ వాడపల్లి వెంకట భాస్కర గోపాలకృష్ణమాచార్యులు, మోడేకుర్రు వేదిక

సమయం : 4 గం॥ల నుండి 6 గం॥ల వరకు

స్వాగతవచనములు : **శ్రీమాన్ సుదర్శనం జనార్ధనాచార్యులు**, వాడపర్రు

సభాధ్యక్షులు : **శ్రీమాన్ ఎస్.వి. రామశర్మ**, అమలాపురం

ముఖ్య అతిథి : **శ్రీమాన్ వేదాంతం రామకృష్ణమాచార్యులు**, విజయవాడ
ఉప సంపాదకులు - వైఖానస పత్రిక.

ఉపన్యాసకులు : శ్రీమాన్ డా॥ పి. విద్యాసాగర్, కోరుకొండ; శ్రీమాన్ పెదపూడి నారాయణరావు, పెదపాడు; శ్రీమాన్ పెద్దింటి శేషాచార్యులు; హైదరాబాద్; శ్రీమాన్ పెద్దింటి రాంబాబు, హైదరాబాద్; శ్రీమతి గంజాంలక్ష్మీ సారంగపాణి, ఒంగోలు; శ్రీమాన్ డా॥ పెద్దింటి రఘు, హైదరాబాద్; శ్రీమాన్ ఆర్.బి. శేష శాయి, హైదరాబాద్; కుమారి అగ్నిహోత్రం భారతీలక్ష్మీ, అడ్వకేట్; శ్రీమాన్ మాల్యవంతం శ్రీనివాస్ C.A.

ఉత్తమ మార్కులుపొందిన విద్యార్థులకు బహుమతుల బహూకరణ

వందన సమర్పణ : శ్రీమాన్ అంగర సత్యనారాయణాచార్యులు, అడ్వకేట్

ఇట్లు,

ఆహ్వాన సంఘము

ఆహ్వాన సంఘపు అధ్యక్షులు : శ్రీమాన్ డా॥ పెద్దింటి సీతారామ భార్గవ, కార్యదర్శి : శ్రీమాన్ K.V.S.R.N. ఆచార్యులు, ఉపాధ్యక్షులు : శ్రీమాన్ వాడపల్లి చిన శోభనాద్రాచార్యులు మరియు వితరణ శీలురు అయిన సభ్యులు ■

విజ్ఞప్తి

దేశ వ్యాప్తంగా విస్తరిస్తున్న వైఖానస యూత్ ఫోరమ్ యొక్క వార్తలు, విశేషాలతో మూడు నెలల కొకసారి ఈ బులిటెన్ ప్రచురితమవుతున్నది. యూత్‌ఫోరం రాష్ట్ర కార్యవర్గపు తీర్మానము ననుసరించి యూత్‌ఫోరం శాఖిలలోని ప్రతి కార్యవర్గ సభ్యుడు శ్రీ వైఖానస పత్రికకు మరియు ఈ న్యూస్ బులిటెన్‌కు ఖచ్చితంగా చందాదారుడై ఉండవలెను. ఈ బులిటెన్ వార్షిక చందా రు. 30/-లు కట్టి పొందండి. (పోషించండి.) మీ ప్రాంతంలో జరిగిన యూత్ కార్యకలాపాలు లేదా విశేషాలు ప్రధాన కార్యదర్శిగారికి పంపండి. ఉపయుక్తమైన వాటిని ప్రచురిస్తాం.

వికసనోమునీంద్రవాణి

(గత సంచిక తరువాయి)

నవమ ప్రశ్నే చతుర్థ ఖణ్డః

24. అగ్నిశాలయందు ప్రోక్షణ చేసి అగ్నికుండమును త్రవ్వి, ఆరు రేఖలు గీసి బంగారపు ముక్కను ధాన్యమును వుంచి పిమ్మట శ్రావణకాగ్ని నుంచవలయును.

25. వన్యములను, పార్థివములను, వనస్పతులను, కుళీరోద్ధతమైన మట్టిని, శణ బీజములు పాతవాటిని, కుశలు దర్భలను, ఊర్ణాస్తుకములను, ప్లక్షాగ్రములను, సుగన్ధి తేజనములు, గుగ్గిలములు, బంగారు ముక్కలు, సూర్యకాన్తములు మొదలగు సంభారములు సమకూర్చుకొనవలెను.

వ్యాఖ్యానము :-

వన్యములు	-	అడవులలో దొరకునవి
పార్థివములు	-	మట్టినుంచి వచ్చినవి 7 రకములు
వనస్పతులు	-	రావి, మేడి, మోదుగ, జమ్మి మొదలగు ఎనిమిది రకముల సమిథలు
కుళీరోద్ధత	-	ఎండ్రకాయ తన నివానము కొరకు చేయు బొరియలోనుంచి ఎత్తి బయటవేసిన మట్టి
ఊర్ణాస్తుకం	-	ఉన్ని
ప్లక్షాగ్రం	-	జువ్వి సమిథలు
సుగన్ధితేజనం	-	సువాసన గల గడ్డి కొనలు

26. వానప్రస్థులను ఋత్విక్కులుగా వరించి అగ్నిమధనము చేసి, గార్హపత్యాది త్రేతాగ్నులను గాని పంచాగ్నులను గాని క్రమముగా ప్రతిష్ఠించి, రెండు రెండు ఆహుతులు హోమము చేయవలెను. రోజు రెండు పూటలందును అడవిలోని పదార్థములతోనే హోమము చేయవలెను.

27. వానప్రస్థుడగు ముని యమ, నియమములను పాటించవలయును.
నియమములనగా : స్నానము, శౌచము, వేదాధ్యయము, తపస్సు, దానము, యజ్ఞములు చేయుట, ఉపవాసము, ఇంద్రియ నిగ్రహము, బ్రహ్మచర్య వ్రతము, మౌనము, అను పదియును
యమములనగా : సత్యము చెప్పుట క్రూరత్వము లేకుండుట, త్రికరణ శుద్ధిగా యుండుట, క్రమతో నుండుట, దమ (ఆత్మదండము), సంతోషముగా వుండుట, ప్రసన్నతతో నుండుట, అహింస, ఎవరినీ కష్టపెట్టకుండుట, మధుర వచనములాడుట అను పదియు యమములు.

28. భక్తితో విష్ణువును ధ్యానిస్తూ, అగ్నిహోత్రములో శ్రామణక హోమములను రెండు పూటలందును విడువక చేయుచూ గ్రామాహారము విడిచి, అడవి యందలి నన్యములు, వండ్లు, దుంపలు, కూరలు నిత్యాహారముగా చేసుకొని "తిరోదాభూ:" అని పైచెప్పిన వాటిని సేకరించి అపరాహ్ణ సమయమున తానుగాని, భార్యగాని అన్నమును ఉప్పు కారము లేకుండా వండవలయును.

29. వైశ్వదేవము పూర్తియైన పిమ్మట అతిథులకు, అభ్యాగతులకు భోజనము పెట్టి తాను మితముగా తినవలయును.

(సశేషము)

ప్రకటన

శ్రీ మరీచి గ్రంథమాల, తిరుమల వారిచే

వైఖానసము-మొదటి వాచకము (Handbook)

ముద్రణ కాబడినది. దీని ఖరీదు రెండు రూపాయలు, ఒకేసారి యాభై పుస్తకములుగాని అంతకుమించిగాని కొనువారలకు పుస్తకములు యింకనూ తగ్గింపు ధరతో అనగా పుస్తకము 1కి రూ. 1-50 చొప్పున యివ్వబడును. వైఖానస సంఘాలవారు, ఆయా ప్రాంతములలో వీటిని బహుళ ప్రచారము గావించ ప్రార్థన, పోస్టు ద్వారా పంపుటకు పోస్టల్ చార్జీలు, రిజిష్టరు పోస్టు ఛార్జీలు అధికము కాగలవు. పుస్తకములు లభించు చోటు :

శ్రీ వైఖానస పత్రిక కార్యాలయము,
వైద్య సేవా సదనము,
రాజ్ యువరాజ్ థియేటరు ఎదురుగా, గాంధీనగరం, విజయవాడ - 520 003.

శ్రీ వైఖానస దివ్య సిద్ధాన్త వివర్ధినీ సభవారు, సంఘీయుల సౌకర్యార్థము ఈ పుస్తకమును సబ్సిడీ ధరతో విక్రయించుచున్నారు. దీనికి గల ప్రోత్సాహమును బట్టి రెండవ వాచకము త్వరలో ముద్రించబడును.

D. వికనసాచార్యులు, కార్యదర్శి
S.V.D.S.V. సభ, తిరుమల

విరళ

శ్రీ వైఖానస పత్రిక జనవరి 1998 సంచికలో 34వ పేజీలో T. T. D. వారిచే ప్రచురింపబడిన అని ముద్రింపబడినది. ఆ పుస్తకములలో ప్రకీర్ణాధికారము, యజ్ఞాధికారము మాత్రము ముద్రించబడినవి. మిగతా గ్రంథములు ముద్రణలో యున్నవి. మార్చి 98కి పూర్తి కావచ్చును.

తిరుమల తిరుపతి దేవస్థాన ప్రచురణలు తిరుపతిలోగాని, తిరుమలలోగాని లేక T. T. D. వారి కళ్యాణ మంటపములలోగల వారి పుస్తక విక్రయశాలలోగాని లభించును. వివరములు కావలసినవారు దిగువ అడ్రసుకు జాబు వ్రాయవలయును.

Public Relations Officer (T. T. D.)
T. T. D. Admn. Building, K. T. Road, TIRUPATI - 517 507

1. ప్రకీర్ణాధికారం — వెల : రూ. 90/-
2. యజ్ఞాధికారం — వెల : రూ. 55/-
3. శ్రీ వైఖానస గృహ్య సూత్రం (శ్రీనివాసదీక్షిత వ్యాఖ్యానం - దేవనాగరలిపి) — వెల : రూ. 49/-

కార్యదర్శి,
S. V. D. S.V. సభ, తిరుమల

Edited, Printed & Published by D. Vikhanasacharyulu,
Secretary, Sri Vaikhanasa Divya Sidhanta Vivardhini Sabha,
Tirumala. Printed at Vani Press, Vijayawada - 520 002.